# జనశక్తి

విప్లవ కమ్యూనిస్టుల పక్ష పత్రిక

www.janashaktionline.com

సంపుటి : 45 సంచిక : 12 విజయవాడ 20-10-2012 పేజీలు : 8 వెల : రు 5.00


లోపలి పేజీల్లో...


- ఆంధ్రప్రదేశ్ శాసనసభలో కా॥ తరిమెల నాగిరెడ్డి ప్రసంగ పాఠాలు
- అమెరికా సామ్రాజ్యవాదమా, వెనిజులాలో జోక్యం మానివెయ్యి
- పెట్టుబడిదారీ సామ్రాజ్యవాద శక్తుల కుతంత్రమే, జీవవైవిధ్య విధ్వంసం –ప్రొ॥ కె.ఆర్. చౌదరి
- పాలకవర్గాలు సృష్టించి, ఆరకుండా రగిలిస్తున్న కాశ్మీరు సమస్య
- హైదరాబాద్ ప్రభుత్వ ఆసుపత్రులపై 'హెల్త్‌వాచ్' అధ్యయన నివేదిక


# అత్యవసర సర్వీసుగా వ్యవసాయం

## కార్పోరేటు సాగుకు సన్నాహంలో భాగం

**సామ్రాజ్యవాద** దేశాల నుండి ద్రవ్య పెట్టుబడిని ఇబ్బడిముబ్బడిగా అన్ని రంగాలలోకి ఆకర్షించటమే భారత సమాజమెదుర్కొంటున్న ఆర్థిక సమస్యలకు ఏకైక పరిష్కారంగా భారత పాలక వర్గాలు ప్రచారం సాగిస్తున్నాయి. ఈ ప్రచారపు హోరులో సామ్రాజ్యవాద పెట్టుబడులకు అన్ని రక్షణలు కల్పిస్తామంటూ వాగ్దానాలు చేస్తున్నాయి. ఈ రక్షణల పేరిట సామ్రాజ్యవాదులు కోరుతున్న అన్ని చర్యలనూ తీసుకుంటున్నాయి. కార్మిక చట్టాలకున్న కొద్దిపాటి శక్తిని కూడా నిర్వీర్యం చేయటంతోపాటు, కార్మికచట్టాలేవీ అమలు కాకుండా చేస్తామని చెబుతున్నాయి. ప్రత్యేక ఆర్థిక మండళ్ళలో కార్మిక చట్టాలేవీ వర్తించవని చట్టాన్ని చేశారు. సామ్రాజ్యవాద పెట్టుబడి సాగించే దోపిడీ, అణచివేతలను కార్మికులు ప్రతిఘటించకుండా చేయాలన్న లక్ష్యంతో వారి హక్కులను కాలరాస్తున్నారు. సామ్రాజ్యవాద పెట్టుబడి ప్రవాహంలా వచ్చి పడ్డ కార్ల తయారీలోని సామ్రాజ్యవాద కంపెనీలన్నీ భారత దేశంలోకి వచ్చాయి. అవి కార్మికులపై సాగిస్తున్న దోపిడీ అణచివేతలు ఎంత తీవ్రస్థాయిలో వున్నాయో హోండా మోటార్స్, టయోటా, సుజుకీ కంపెనీలలో సాగిన కార్మికుల పోరాటాలు తెలిపాయి. అంతేగాక విడిభాగాలను 30 శాతం అధికరేటుకు అమ్ముతూ భారత వినియోగదారులను కూడా నిలువు దోపిడీ చేసుకుంటున్న తీరును కాంపిటీషన్ కమీషన్ ఆఫ్ ఇండియా ఇటీవల బయటపెట్టింది. దోపిడీని ప్రతిఘటిస్తూ కార్మికులు ఎలాంటి కార్యాచరణకు దిగినా ప్రభుత్వమూ, యాజమాన్యాలూ పాశవిక నిర్బంధకాండకు పూనుకుంటున్నాయి. సమ్మెచేసే హక్కు, సమష్టి బేరసారాలాడే హక్కు కార్మికులకుండరాదంటూ, ఇవి ఉన్నంత కాలమూ, విదేశీ పెట్టుబడులు రావనీ, పరిశ్రమలు పెరగవనీ బోధిస్తున్నారు. విదేశీ పెట్టుబడిదారుల ముందు ఏ హక్కులూలేని కట్టు బానిసలుగా కార్మికులను దిగజార్చటమే ఈ విధానాల లక్ష్యం.

ఇప్పుడీ విధానాన్నే రైతాంగానికి వర్తింపచేసేందుకు భారత పాలకులు తెగబడుతున్నారు. నూతన ఆర్థిక విధానాల పేరిట వ్యవసాయ రంగంలోకి సామ్రాజ్యవాద పెట్టుబడి చొరబాటును తీవ్రం చేసే చర్యలు తీసుకున్నారు. విత్తన రంగాన్ని సామ్రాజ్య వాదకంపెనీల పరం చేశారు. ఎరువుల రంగాన్ని అప్పజెప్పారు. ప్రపంచ బ్యాంకు రుణంతో నీటిపారుదలా వ్యవస్థను మెరుగుపరిచి ప్రతి నీటిబొట్టునూ అమ్మేందుకు చర్యలు తీసుకుంటున్నారు. వ్యవసాయ సాంకేతిక పరిజ్ఞానాన్ని రైతాంగానికి అందుబాటులోకి తెచ్చే విస్తరణ సేవలను కూడా కంపెనీల పరం చేశారు. ఆహార పంటల స్థానంలో వాణిజ్య పంటలు వేసి కంపెనీలకు ముడిసరుకు అందించమని రైతాంగాన్ని ప్రోత్సహిస్తున్నారు. వ్యవసాయ ఉత్పత్తుల మార్కెట్టు నుండి ప్రభుత్వం తప్పుకుని ప్రైవేటు శక్తులకు అప్పగిస్తున్నది. ఈ విధానాలతో వ్యవసాయరంగంలో సంక్షోభాన్ని సృష్టించి దానికి పరిష్కారంగా కాంట్రాక్టు/కార్పోరేటు సాగును చూపుతున్నాయి.

ఈ కార్పోరేటు సాగును విదేశీ కంపెనీలు చేపట్టేందుకు అనువుగా వ్యవసాయ పంటల ప్రాసెసింగ్ పరిశ్రమలలోకి విదేశీ పెట్టుబడులను అనుమతించారు. ప్రైవేటు మార్కెట్టుయార్డులు పెట్టుకునేందుకు అంగీకరించారు. కంపెనీలు వ్యవసాయ పంటల అమ్మకాలలోకి ప్రవేశించే విధంగా చట్టాన్ని సవరించారు. చివరకు వ్యవసాయ పంటలను కొని, అమ్మేందుకు వీలుగా చిల్లర వ్యాపారంలోకి విదేశీ పెట్టుబడులను అనుమతించారు. ఆ విధంగా రైతాంగాన్ని విదేశీ కంపెనీలకు బంధిత ఉత్పత్తిదారుగా మార్చేందుకు అన్ని సన్నాహాలూ చేశారు.

పారిశ్రామిక రంగంలో విదేశీ పెట్టుబడుల రక్షణకు హామీగా కార్మికుల హక్కులను కాలరాస్తున్న తీరులోనే, రైతాంగానికి కూడా హక్కులేవీ లేకుండా చేసి దోపిడీ, అణచివేతలకు లోబడి ఉంచేందుకు నిరంకుశ చట్టాలను చేయటానికి పూనుకుంటున్నారు.

ఎన్ని నిరంకుశ చట్టాలతో ఎంత నిర్బంధకాండను సాగించినా దోపిడీ అణచివేతలకు వ్యతిరేకంగా కార్మికులు పోరాడుతున్నారు. తమ హక్కులను నిలబెట్టుకునేందుకు పెట్టుబడిదాడిని తీవ్రంగా ప్రతిఘటిస్తున్నారు. రైతాంగం కూడా ఇప్పటికే పోరాట పథాన్ని చేపట్టారు. విత్తనాలకొరకూ, ఎరువుల సక్రమ సరఫరాకొరకు, కల్తీ ఎరువులు, నకిలీ విత్తనాలకు వ్యతిరేకంగా, తమ పంటకు న్యాయమైన ధరకోసం, సంస్థాగత రుణాల కొరకు వారు సంఘటితంగా పోరాటాలు సాగిస్తున్నారు. సాగు చేయటానికి శ్రమించటంతోపాటు, సాగుకు అనువైన విధానాల కొరకు కూడా వారు పోరాడాల్సి వస్తున్నది. ఇది భారత పాలకులు తమ విధానాలతో రైతాంగానికి సృష్టించిన సంక్షోభపు వ్యక్తీకరణ.

దీనిని పరిష్కరించేందుకు, రైతాంగానికి న్యాయం చేసేందుకు వారు పూనుకోరు. కారణం–అది వారు కావాలని సృష్టించిందే కాబట్టి! ఇక భారత పాలకులకు మిగిలిందల్లా వ్యవసాయ రంగంలోకి చొచ్చుకువస్తున్న సామ్రాజ్యవాద పెట్టుబడినీ, దాని దుష్ఫలితాలనూ రైతాంగం ప్రతిఘటించకుండా అడ్డుకోవటమే. దీనికే భారత దోపిడీ పాలకులు పూనుకున్నారు.

కేంద్ర విద్యుత్తు శాఖామంత్రి వీరప్పమొయిలీ "కరవుపీడిత రైతాంగానికి ఉపశమనంగా విద్యుత్తు సరఫరా చేసేందుకు వీలుగా వ్యవసాయాన్ని అత్యవసర సర్వీసుగా గుర్తించే ప్రతిపాదనను కేంద్ర ప్రభుత్వం పరిశీలిస్తున్నదని" చెప్పారు. (దక్కన్ క్రానికల్ 5-8-2012). దీనికోసం విద్యుత్తు పంపిణీ రంగాన్ని పటిష్టంచేసే చర్యలు తీసుకుంటామనీ, త్వరలోనే కేంద్రవ్యవసాయమంత్రి శరద్‌పవార్ కూడా ఈ ప్రతిపాదనను పరిశీలిస్తారని చెప్పారు.

తాటిచెట్టెందుకెక్కావంటే దూడగడ్డికోసమన్న చందంగా వుంది మంత్రిగారి ప్రకటన. విద్యుత్తు రంగం అత్యవసర సర్వీసుగానే వుంది. రైతాంగానికి విద్యుత్తు సరఫరా చేయటమనే లక్ష్యం ప్రభుత్వానికుంటే ఇది సరిపోతుంది. విద్యుత్తు అత్యవసర సర్వీసు కనుక వ్యవసాయానికి విద్యుత్తు సరఫరా చేయాలని ఆదేశమివ్వవచ్చు. దీనికోసం వ్యవసాయాన్ని అత్యవసర సర్వీసుగా ప్రకటించనవసరం లేదు. ఇతరేతర లక్ష్యాలతో ఈ ప్రతిపాదనను ప్రభుత్వం ముందుకు తెస్తున్నదన్నది స్పష్టం.

భారత దేశ జనాభాలో 70 శాతానికి వ్యవసాయమే జీవనాధారం. ఆర్థిక వ్యవస్థకు అదే జీవగర్ర. అలాంటి వ్యవసాయరంగాన్ని జీవంతో తొణికిసలాడేట్లు చేయాలంటే వ్యవసాయ ఆధారిత జనాభాకు ఆదాయాన్ని పెంచే విధానాలు అనుసరించాలి. దీనికి పూర్తివ్యతిరేక ఫలితాన్నిచ్చే అంటే రైతాంగ ఆదాయాన్ని దోచుకునే విధానాలను ప్రభుత్వం అనుసరిస్తున్నది. రైతాంగ సంక్షేమంపట్ల ఏమాత్రం చిత్తశుద్ధి వున్న ప్రభుత్వమైనా పంటభూములను ఇతర కార్యకలాపాలకు మరల్చడాన్ని **(తరువాయి 2వ పేజీలో)**

సంపాదకీయం

# మహిళా సమస్య–కొన్ని ప్రతీప ధోరణులు

**భారత** దోపిడీ పాలక వర్గాలు అమలుచేస్తున్న విధానాల ఫలితంగా మహిళ లెదుర్కొంటున్న సమస్యలు నానాటికీ తీవ్రమౌతున్నాయి. నూతన ఆర్థిక విధానాలతో శ్రామిక మహిళలకు ఉపాధి సౌకర్యాలు కుదించుకుపోతున్నాయి. మహిళల శ్రమను కారుచౌకగా కొల్లగొట్టుకునేందుకు మహిళా సాధికారిత పేరిట మోసపూరిత విధానాల ననుసరిస్తున్నారు. సెజ్‌లు, రెడిమేడ్ బట్టల తయారీలలో మహిళలపై శ్రమదోపిడీ తీవ్రస్థాయికి చేరింది. సూక్ష్మరుణాల పేరిట జలగల్లా రక్తాన్ని పీల్చే వడ్డీవ్యాపారం మహిళలను ఆత్మహత్యల వైపు నెట్టింది. కాలం చెల్లిన భూస్వామ్య సంబంధాలు కొనసాగుతూ, వాటికి తోడు సామ్రాజ్యవాద దోపిడీ తీవ్రంకావటంతో భూస్వామ్య భావజాలమూ, సామ్రాజ్యవాద వస్తువ్యామోహమూ, ఇవి వ్యాప్తిచేస్తున్న క్షీణసంస్కృతి కలగలిసి మహిళల జీవనాన్ని దుర్భరం చేస్తున్నాయి.

సమస్యల తీవ్రత పెరగటంతో వాటి పరిష్కారాన్ని కోరుతూ మహిళా చైతన్యం కూడా పెరుగుతున్నది. ఎదురౌతున్న సమస్యలనే కాక వాటి మూలకారణాలను కూడా తొలగించాలన్న దిశగా వారి చైతన్యం సాగుతున్నది. క్రమంగా వర్గదోపిడీ, అణచివేతలు తొలగించకుండా మహిళా విముక్తికి మార్గం సుగమం కాదన్న స్పృహ పెరుగుతున్నది. ఇది పెరగకుండా, పెరిగినా దాన్నిపెడదారికి మళ్లించే ప్రయత్నాలను అభివృద్ధి నిరోధకశక్తులు చేస్తున్నాయి. అరకొర సంస్కరణలనే మహిళా విముక్తిగా చూపుతున్నాయి. మహిళల చైతన్యాన్ని మొద్దుబార్చే సిద్ధాంతాలనూ, వాదనలనూ ముందుకు తెస్తున్నాయి.

కేంద్ర మహిళా శిశు సంక్షేమశాఖా మంత్రి కృష్ణాతీరత్–భర్త వేతనంలో కొంత శాతాన్ని నిర్బంధంగా భార్య బ్యాంకు ఖాతాలో జమచేసే విధానంకొరకు చట్టాన్ని చేసే ప్రతిపాదనను ప్రభుత్వం పరిశీలిస్తున్నదని చెప్పారు. ఆమె చేస్తున్న ఇంటిచాకిరికి ఇది వేతనం కాదనీ, గౌరవ చెల్లింపు అనీ, దీనికి ఆదాయపు పన్ను నుండి మినహాయింపు ఇస్తామనీ వివరణ యిచ్చారు. ఈ ప్రకటనపై చర్చోప చర్చలు సాగుతున్నాయి.

మహిళలు చేస్తున్న ఇంటిచాకిరిపై మహిళా ఉద్యమంలో చర్చ చాలాకాలంగా సాగుతున్నది. ఆర్థిక రాజకీయ రంగాలలో వీస్తున్న పడమటిగాలే ఇక్కడా కన్పిస్తున్నది. ఫ్యూడలు సమాజానికి ఆర్థిక యూనిటు కుటుంబం. స్త్రీ పురుషుల మధ్య శ్రమ విభజనలో ఆహార, ఇతర సంపద సముపార్జన పురుషుల బాధ్యతకాగా, దానిని కుటుంబ అవసరాలకు వినియోగించటం స్త్రీ బాధ్యతగా వుండేది. ఆహారాన్ని దాచివుంచటం, ఏడాది పొడవునా వినియోగించుకునేందుకు వీలుగా వాటిని తయారుచెయ్యటం, కుటుంబ అవసరాలకు బట్టలతయారీ ప్రధానంగా స్త్రీల ఆధీనంలో వుండేవి. దీనిలో కొన్ని తరతమ స్థాయీ బేధాలున్నా స్త్రీలు గృహాలలో సాగిస్తున్న శ్రమకు సామాజికంగా విలువ గుర్తించబడింది. పెట్టుబడిదారీ విధానం, పని ప్రదేశాన్ని గృహంనుండి ఫ్యాక్టరీకి మార్చింది. దీనితో ఆర్థిక యూనిటుగా కుటుంబం ఉనికిని కోల్పోయింది. గృహంలో మహిళలు సాగిస్తున్న ఉత్పాదక శ్రమను కూడా ఫ్యాక్టరీకి మార్చింది. ఫ్యాక్టరీలో శ్రమకే విలువ నేర్పరచింది. మహిళల రోజువారి ఇంటి పనులను విలువలేని చాకిరీగా మార్చింది. పురుషాధిక్య సమాజంలో గృహిణిస్థాయి దిగజారిపోయి, విలువలేని బండచాకిరీ చేసే యంత్రంగా మారిపోయింది. ఈ చారిత్రక గమనం వెనక్కుమళ్లదు. మళ్లించాలని కోరుకోరాదు. మహిళలను ఈ బండచాకిరీ నుండి విముక్తి చేయాలంటే వారిని ఉత్పాదకశ్రమలోకి తీసుకురావాలి. సగం జనాభా ఉత్పాదక శ్రమలో పాలుపంచుకోకుండా సమాజం పురోగమించదు. బండచాకిరీతో మహిళల్లో సృజనాత్మక శక్తి అణచివేయబడి సామాజిక పురోగమనానికి ఆటంకంగా వుంది. స్త్రీల గృహ శ్రమలో పురుషులు పాలుపంచుకోవటమూ, సామూహిక వంటశాలల నిర్వహణవంటి చర్యలు మహిళల బండచాకిరీ తీవ్రతను తగ్గించగల మధ్యంతర చర్యలుగా వుంటాయి. స్త్రీ పురుష సమానత్వాన్ని వర్గాలులేని సమాజం మాత్రమే సాధించగలదు. దీనిని గుర్తించనివ్వకుండా తమ కుటుంబ సభ్యులపట్ల ప్రేమతోనూ, స్త్రీలకు సహజత్వమైన మాతృత్వ ఆదరణతో చేస్తున్న పనులకు వేతనాలు చెల్లించి వాణిజ్య కార్యకలాపంగా మారుస్తున్నారన్న వాదనలుగానీ, స్త్రీల ఇంటిచాకిరికి చెల్లింపుల ద్వారా గుర్తింపు నిచ్చి మహిళల సాధికారతను పెంచాలన్న వాదనలుగానీ ఇంటిచాకిరీనుండి స్త్రీలను బయటవేసేందుకు తోడ్పడేవి కాకపోగా దానినే స్త్రీల బాధ్యతగా స్థిరీకరిస్తాయి.

కుటుంబ ఆదాయాన్ని పెంచకుండా, ఇప్పుడు వస్తున్న పరిమిత ఆదాయాన్నే పంచినందున కుటుంబ స్థితి మెరుగుపడదు. కుటుంబ సభ్యుల అవసరాలు తీర్చి తాను పస్తులుండే మహిళల స్థితి మెరుగుపడదు. పురుషాధిక్య భావజాలం రాజ్యమేలే స్థితిలో కుటుంబ పోషణ భారాన్ని స్త్రీలపై మోపే తీరు పెరుగుతోంది. మహిళలను ఉత్పాదక శ్రమలో భాగం చేయటంద్వారా పెరిగే సామాజిక **(తరువాయి 2వ పేజీలో)**

**మహత్తర చైనా, రష్యా విప్లవాలకు జేజేలు**

## అత్యవసర... (మొదటి పేజీ తరువాయి)

ఆపివేయాలి. కాగా ప్రభుత్వమే రైతాంగం నుండి బలవంతంగా పంటభూములను గుంజుకుని దోపిడీ వర్గాలకు కట్టబెడుతున్నది. దీనినాపేందుకు వ్యవసాయాన్ని అత్యవసర సర్వీసుగా ప్రభుత్వం ప్రకటించడానికి పూనుకోలేదు. ఏడాది ఏడాదికీ పెంచుకుంటూపోతున్న ఎరువులూ, విత్తనాల ధరలను నియంత్రించేందుకు ఆ పరిశ్రమలను అత్యవసర సర్వీసులుగా ప్రకటించబూనుకోలేదు. ప్రైవేటు మార్కెట్టు శక్తులు రైతాంగానికి కనీస మద్దతు ధరనన్నా చెల్లించేట్టు చేయటానికి అత్యవసర సర్వీసుగా ప్రకటించ బూనుకోలేదు. కరువు ఏర్పడిన సమయంలో సాగునీటికోసం విద్యుత్తు సరఫరా చేసేందుకు మాత్రమే వ్యవసాయాన్ని అత్యవసర సర్వీసుగా ప్రకటిస్తామంటున్నారు. వాస్తవానికి అలా ప్రకటించకుండానే సాగునీటి కోసం వ్యవసాయ బావులకు కరెంటును ఉచితంగా అనేక రాష్ట్రాలు సరఫరా చేస్తున్నాయి. వ్యవసాయాన్ని అత్యవసర సర్వీసుగా ప్రకటించకపోవటం దీనికి ఎలాంటి అడ్డంకులూ కలిగించలేదు.

ఇంతకీ అత్యవసర సర్వీసుగా ప్రకటిస్తే ప్రభుత్వానికి వచ్చే అదనపు అధికారాలేమిటి? 'సాధారణ పౌరజీవనాన్ని' భంగపరిచే ఏ సేవనైనా అత్యవసర సర్వీసుగా ప్రభుత్వం ప్రకటించవచ్చు. పోస్టు, టెలిఫోన్లు, రైళ్లు, బస్సు, విమాన రవాణా, రేవులు, కస్టమ్సుశాఖ, రక్షణశాఖలు అత్యవసర సర్వీసులుగా వున్నాయి. ఇవికాక ప్రభుత్వం దేనినైనా అత్యవసర సర్వీసుగా ప్రకటించవచ్చు. 'ప్రజలకు సరఫరాలు, సేవలు కొనసాగించడానికి' అవసరమని ప్రభుత్వం భావిస్తే చాలు. అత్యవసర సర్వీసుగా ప్రకటిస్తే , ఆ రంగానికి అత్యవసర సర్వీసుల నిర్వహణా చట్టాన్ని (ఎస్మా), జాతీయభద్రతా చట్టాన్ని వర్తింపచేసే అధికారం ప్రభుత్వానికి దఖలు పడుతుంది.

ఎస్మా చట్టం ప్రభుత్వానికిచ్చే అధికారమేమిటంటే, అత్యవసర సర్వీసుగా ప్రకటించిన రంగంలో సమ్మెలనూ, సమ్మెలను రెచ్చగొట్టడాన్ని, సమ్మెలకు ఆర్థిక సహాయ మందించటాన్ని చట్టవిరుద్ధ కార్యకలాపాలుగా ప్రకటించ గలగటం. ఎక్కడ కార్మికులు సమ్మెనోటీసు ఇచ్చినా, ప్రభుత్వ ఉద్యోగులూ, ఉపాధ్యాయులూ సమ్మెకు పూనుకున్నా, వాటిని అత్యవసర సర్వీసుగా ప్రకటించి, ఎస్మా చట్టాన్ని ప్రకటించటం పరిపాటిగా మారింది. ఆర్టీసి కార్మికులు, ఎన్‌జీఓలు, ఉపాధ్యాయులు, చౌక ధరల దుకాణాల డీలర్లు, అధ్యాపకులు, విద్యుత్తు లైనుమెన్లు, తమ సమస్యల పరిష్కారాన్ని కోరుతూ సమష్టి కార్యాచరణకు దిగితే 'పౌరజీవనానికి సరఫరాలూ, సేవలూ భగ్నమౌతాయ'న్న వాదనతో సమ్మెలను నిషేధించటమే పాలకులు చేస్తూవస్తున్నారు. ఈ నేరం క్రింద ఆరునెలల నుండి ఒక ఏడాది వరకు జైలు మరియు/లేదా 200 నుండి 2000 రూ॥ల వరకు జరిమానాతో శిక్షించవచ్చు. వ్యవసాయాన్ని అత్యవసర సర్వీసుగా ప్రకటిస్తే ప్రభుత్వానికి సమకూరే అధికారం వేతనాల పెంపుదల కోరుతూ వ్యవసాయ కూలీలూ, సాగుకు అవసరమైన ఉత్పాదకాల సరఫరాను సరసమైన ధర కోరుతూ, తమ పంటకు న్యాయమైన ధరను కోరుతూ రైతాంగమూ సమష్టి బేరసారాలు సాగించటాన్ని, ఆందోళనకు, సమ్మెకు పూనుకుంటే వాటిని నిషేధించే అధికారం.

పులిమీద పుట్రలా, ఎస్మాకు తోడు టెర్రరిజం బూచిని చూపి జాతీయ భద్రతాచట్టాన్ని చేశారు. "పౌరజీవన నిర్వహణకు అవసరమైన సరఫరాలూ, సేవలకు భంగం కలిగించే విధంగా వ్యవహరించేవారిని" విచారణ లేకుండా ఏడాదిపాటు జైలులో పెట్టే అధికారం ప్రభుత్వానికి దఖలు పడుతుంది. కనుక అత్యవసర సర్వీసుగా ప్రకటించిన ఏ రంగంలోనైనా సమష్టి బేరసారాలూ, సమ్మెలకు పూనుకుంటే వారిని విచారణ లేకుండా జైలులో కుక్కుతారు.

వ్యవసాయాన్ని అత్యవసర సర్వీసుగా ప్రకటించటమంటే వ్యవసాయకూలీలతో సహా రైతాంగపు హక్కులను కాలరాయటమే. సెజ్‌ల పరిశ్రమల్లో పనిచేసే, చేస్తున్న కార్మికులకు ఎలాంటి హక్కులూ లేకుండా చేశారు. సెజ్‌ల పరిధిలోకి రాని పరిశ్రమల్లో కూడా కార్మికులకు చట్టబద్ధ హక్కులను కూడా నిరాకరిస్తున్నారు. వారు ప్రతిఘటిస్తే చట్టవ్యతిరేకమని అణచివేస్తున్నారు. ఇదంతా కార్మికుల శ్రమను దోపిడీ చేసి లాభాలను మూట గట్టుకునే విదేశీ బడాబూర్జువాలకు మద్దతుగానే సాగుతున్నది.

విదేశీ కంపెనీల కార్పోరేటు సాగుకు రంగాన్ని సిద్ధం చేసిన ప్రభుత్వం, వారు పనిలో పెట్టుకునే వ్యవసాయ కూలీల శ్రమను నిరాఘాటంగా దోపిడీ చేసుకునేందుకు వ్యవసాయ కూలీల హక్కులను కాలరాచి కంపెనీలకు 'శాంతి'ని నెలకొల్పుతుంది. కాంట్రాక్టు సాగులో రైతాంగాన్ని నిలువు దోపిడీ చేసే అక్రమ చర్యలను రైతాంగం ప్రతిఘటించకుండా చేసి కంపెనీలకు "శాంతి భద్రత" లను కల్పించబూనుకున్నదీ ప్రభుత్వం. 'అభివృద్ధి' పేరిట రైతాంగం నుండి బలవంతపు భూసేకరణకు వస్తున్న ప్రతిఘటనను అణచివేసేందుకు నిర్బంధ చర్యలకు 'చట్టబద్ధత' అన్నకోరలు తగిలించ బూనుకున్నది ప్రభుత్వం.

గత రెండు దశాబ్దాలుగా అమలు జరుపుతున్న నూతన ఆర్థిక విధానాల కొనసాగింపుగా రెండవ దశ సంస్కరణల అసలు రూపమిది. వ్యవసాయ కూలీల హక్కులను కాలరాచే చర్యగా దీనిని చూసి భూస్వామ్య వర్గాలు చేతులు బారచాచవచ్చు. అయితే పేద, మధ్యతరగతి రైతాంగం తమ మనుగడకోసం వ్యవసాయ కూలీలతో కలిసి ఈ ప్రతిపాదనను తీవ్రంగా ప్రతిఘటించాలి. ✡

## మహిళా సమస్య... (మొదటి పేజీ తరువాయి)

ఉత్పత్తి పంపకంతో కుటుంబ ఆదాయాన్ని పెంచగలం. అయితే పెట్టుబడిదారీ విధానం జాతీయ ఉత్పత్తి పంపిణీలో సమానత్వాన్ని పాటించనందువల్ల శ్రమకు తగ్గ ప్రతిఫలం రాక ఇంటాబయటా మహిళల శ్రమ పెరుగుతోంది. జాతీయ ఉత్పత్తి పంపిణీలో అసమానత్వాన్ని పాటించే పెట్టుబడిదారీవిధానాన్ని తొలగించటంతోనే మహిళలను బండచాకిరీనుండి విముక్తిచేయటం సాధ్యమౌతుంది.

స్త్రీలపై అత్యాచారాలూ, దౌర్జన్యాలు, బలాత్కారాలూ నానాటికీ పెరుగుతున్నాయి. ఫ్యూడలు, పెట్టుబడిదారీ క్షీణ సంస్కృతులు కలగలిసి స్త్రీని అనుభవైక సరుకుగా చిత్రిస్తున్న, దానినే ప్రోత్సహిస్తున్న విధానాల ఫలితమిది. జాగరూకమౌతున్న మహిళా చైతన్యాన్ని అణచేందుకు ఈ స్థితిని అభివృద్ధి నిరోధక వర్గాలు వినియోగిస్తున్నాయి. మహిళలపై సాగుతున్న బలాత్కారాలను ఆపేందుకు బాల్య వివాహాలను చేయటమే పరిష్కారమని "పరువు హత్యలు" సాగిస్తున్న ఖాప్ పంచాయితీ పెద్దలు ప్రకటించటమూ, స్త్రీల రెచ్చగొట్టే వస్త్రధారణే బలాత్కారాలకు దారితీస్తుందన్న ఎన్నాళ్లనుండో సాగుతున్న వితండవాదనలనే మమతాబెనర్జీ ఇటీవల చేయటమూ దీనినే తెలుపుతున్నాయి. ఈ వాదనలు స్త్రీలపైనే నిందను మోపుతున్నాయి. రెచ్చగొట్టే వేషధారణే, బాల్యవివాహాలవంటి అకృత్యాలనుండి బయటపడటమే – బలాత్కారాలకు దారితీస్తుందనటం వంటివన్నీ మహిళలు గడపదాటిరాకుండా చేసే ప్రయత్నాలే. పురుషాధిక్యతా, వర్గవ్యత్యాసాలు మహిళ అణచివేతకు మూలమన్న వాస్తవాన్ని మరుగుపరిచే ప్రయత్నమే ఇది.

ఎక్కడో మూలనున్న కుగ్రామంలోని పంచాయితీ పెద్దల మాటలకు ప్రచారమివ్వటం ద్వారా ఈ ప్రతీప భావజాలవ్యాప్తిని పాలకులు ప్రోత్సహిస్తున్నారు. మహిళలకు ఉపాధి, కనీస వేతనాలు కల్పించకుండా మహిళా సాధికారత జపంతో వాటినే స్థిరీకరిస్తున్న దోపిడీ పాలకవర్గాలు, అభివృద్ధి నిరోధక భావజాల వ్యాప్తితో మహిళా చైతన్యాన్ని మొద్దుబార్చజూస్తున్నాయి. వర్గ చైతన్యాన్ని పెంచుకుని శ్రామిక వర్గాలు ఈ భావజాలాన్ని త్రిప్పికొట్టాలి. ✡

## దేశాన్ని... (3వ పేజీ నుండి)

న్యాయం. అలాంటివి ఇకముందైనా జరుగకుండా చూడవలసిన బాధ్యత ఈనాడు ముఖ్యమంత్రి అయిన సంజీవరెడ్డిగారి మీద ఉంది. ఈ విషయాన్ని వారు గమనించాలని కోరుతున్నాను. అప్పుడే మనం ఫ్యూడల్ శక్తుల బలాన్ని అణచగలం. అప్పుడే వారి ఎత్తుగడలను అడ్డుకోగలం. అప్పుడే ఆంధ్రదేశంలో భూస్వామ్య విధానానికి బదులు నిజమైన ప్రజాస్వామ్య విధానం రావడానికి వీలవుతుంది. నెహ్రూగారు చెప్పినట్లు ఫ్యూడల్ శక్తులను అదుపులో పెట్టినప్పుడే ఆంధ్రదేశానికి గాని, భారతదేశానికిగాని నిజమైన ప్రజాస్వామ్యం ఉంటుంది, లేకపోతే ఉండదు అనే విషయం అందరికీ తెలిసిందే. దీనిని మనం ఏ మాత్రం అమలు చేశామన్నది జాగ్రత్తగా పరిశీలించాలి. ఏ మాత్రం అమలు జరుపలేదు.

ఆంధ్రదేశం పరిస్థితులను గవర్నర్‌గారి ఉపన్యాసం ఏ మాత్రం సమీక్షించలేదు. ఇక్కడ చేయకపోతే మానె, బడ్జెట్ ఉపన్యాసంలో ఆర్థిక మంత్రిగారు చేస్తారనుకుంటే ఆయన ఇంత మాత్రం కూడా చేయలేదు. ఆర్థిక మంత్రి గారికి కరువు ఎక్కడా కనిపించకపోతే, రుతుపవనాల పరిస్థితి కొన్నిచోట్ల బాగాలేదని చెప్పడానికైనా గవర్నర్ గారికి తోచింది. కరువు ఉన్నదని అంగీకరించడానికి ప్రభుత్వానికి భయమా? కరువు అనే మాటను అంగీకరిస్తే తక్షణమే తీసుకోవలసిన చర్యలు కొన్ని ఉన్నాయి. దుర్భిక్ష నివారణకు ఉద్దేశించిన నియమావళిని పాటించాలి. చిన్న పిల్లలకు, ముసలి వాళ్ళకు, పని చేయలేని వారికి తిండి పెట్టాల్సిన బాధ్యత తక్షణమే ప్రభుత్వం మీద పడుతుంది. ఈనాడు తప్పించుకు తిరిగినట్లు ఆనాడు తిరగలేము. దుర్భిక్షం వచ్చిందనే విషయాన్ని అంగీకరించడానికి ప్రభుత్వం సిద్ధంగా లేదు. జనానికి అక్కడక్కడ నాలుగు రోజులు పని చూపించడానికి 27 లక్షల రూపాయలు ఖర్చు చేశామని చెబుతున్నారు. 27 లక్షల రూపాయలు దేనికి అవుతాయి, ఎక్కడ అవుతాయి? ముఖ్యమంత్రి కానప్పుడు శ్రీ సంజీవరెడ్డి ఎన్నికలకుగాను అనంతపురం జిల్లాకు వచ్చినప్పుడు చూసే ఉంటారు. ఆయన గ్రామాలలోగాని, మా గ్రామాలలోగాని ఎంత మంది గ్రామాలు వదిలిపెట్టి పోతున్నారు. మా తండ్రిగారి కాలంలో కూడా అంతమంది గ్రామాలు వదిలిపెట్టి పోయిన రోజులు లేవు. ఆనాడు కరువు వచ్చినప్పుడు ప్రభుత్వం తక్షణమే ఏవో పనులు చేపట్టడం వల్ల పేదవారికి, చిన్న పిల్లలకు, పనిచేయలేని వారికి అంతో ఇంతో తిండి దొరుకుతుండేది కాబట్టి గ్రామాల నుంచి వెళ్ళిపోయేవారి సంఖ్య తక్కువగా ఉండేది. ఈనాడు ఎక్కడెక్కడికో పోయారు. అనంతపురం జిల్లా ఆ చుట్టుప్రక్కలలో ఉండే తాలూకాలలో దుర్భిక్ష పరిస్థితులు ఏర్పడ్డాయి. కాబట్టి దుర్భిక్ష ప్రాంతం అని ప్రభుత్వం తక్షణమే ప్రకటించాలి. ఇందుకు సంబంధించిన నియమావళిని వర్తింపచేసి అడిగిన వారందరికీ పని ఇవ్వాలని నేను ప్రభుత్వాన్ని కోరుతున్నాను. పనులిచ్చిన చోట్ల కూలిపనికి అవసరమైన సదుపాయాలు కల్పించాలి.

ఇక మన రాష్ట్రంలో కొత్త పరిశ్రమలుగాని, ప్రాజెక్టులనుగాని ఏమి ప్రారంభిస్తారో గవర్నర్‌గారి ప్రసంగంలో లేదు. అంటే మనకొక కార్యక్రమం లేదన్నమాట. గుడ్డివాడు వెళుతున్నట్లు వెళుతున్నాము. మంచి దోవలో పడితే సరే, మంచిదే. లేకపోతే ఏ గుంతలోనో పడే ప్రమాదం వుంది. ఆంధ్రదేశానికి సరైన కార్యక్రమాలు లేవు. ఎరువుల ఫ్యాక్టరీ గురించి ప్రభుత్వం ఏమి చేసిందో ఇంత వరకు తెలియదు. మూడవ ప్రణాళికా కార్యక్రమంలో కొత్తగూడెం ఎరువుల ఫ్యాక్టరీని చేర్చినా చివరి దశలో ఆ ఒక్కమాట అందులోనుంచి ఎగిరిపోయింది. ఎందుకావిధంగా జరిగింది? ప్రభుత్వ రంగం నుంచి ప్రైవేటు రంగానికి ఎందుకు వెళ్ళింది? ప్రైవేటు రంగంలో త్వరగా నిర్మాణం జరుగుతుందంటారా? మనం తీసివేసిన తరువాత ఉత్తర ప్రదేశ్‌లో భోలక్‌పూర్‌లో చేర్చామని మూడవ ప్రణాళిక మనకు చెప్పింది. ఆంధ్రదేశం వద్దంటే దానిని ఉత్తర ప్రదేశ్‌కు మంజూరు చేశారు. ఎందువల్ల ఈ మార్పు జరిగింది? ఈ అన్యాయం ఆంధ్రదేశానికి జరగడానికి ప్రజలకు వాస్తవాన్ని తెలియచేయవలసిన అవసరం ఉంది. న్యూస్‌ప్రింట్ ఫ్యాక్టరీ గురించి శాసనసభలోగాని బయటగాని అనేక స్టేట్‌మెంట్లు ప్రభుత్వం ఇచ్చింది. అయితే పని చేయడంలో మాత్రం సున్నా. భారీ పరిశ్రమలకు సంబంధించిగాని, మధ్యతరహా పరిశ్రమలకు సంబంధించిగాని ఆంధ్ర ప్రభుత్వానికి ఒక ప్రణాళిక ఉన్నట్లు మేము అనుకోవడం లేదు. రానురాను ఆంధ్రదేశం అన్ని విషయాలలోనూ వెనుకబడుతున్నది. ఈనాడు అభివృద్ధిలో ఆంధ్రరాష్ట్రం 14వ స్థానంలోనో, 15వ స్థానంలోనో ఉంది. ఆంధ్రదేశం పారిశ్రామికాభివృద్ధి సాధించడానికి అవసరమైన సూచనలు చేయడం కోసం శాసనసభ్యులతోను, ఇతరులతోను ఒక కమీషన్‌ను నియమించవలసిన అవసరం ఉన్నదని మనవి చేస్తున్నాను. ఇంకొక ప్రధాన విషయం గురించి నేను చెప్పాల్సి ఉంది. అది విద్యుచ్ఛక్తి. 1954లో మంజూరైన కొన్ని విద్యుచ్ఛక్తి పథకాలు 1962 వరకు కూడా ప్రారంభం కాలేదు అని ఒక అధికారి ఆ మధ్య ఒక ప్రకటన ఇచ్చారు. అది తుంగభద్ర ప్రాజెక్టు క్రింద అనుకుంటా. ఏ దేశాభివృద్ధికైనా విద్యుచ్ఛక్తి ముఖ్యం. అయితే ఇంధన వనరులను అభివృద్ధి చేసుకోవడానికి మనం ఎంత వరకు కృషి చేశాము? కనీసం 1967వ సంవత్సరం వచ్చేనాటికైనా సరే, మనం ఇప్పుడున్న 14వ స్థానం నుంచి 13వ స్థానానికో, 12వ స్థానానికో రాగలమా!

రాయలసీమ కరువును ఒక తుంగభద్ర ఎగువ కాలువతో పోగొట్టలేము. అక్కడ విద్యుచ్ఛక్తి కావాలి. విద్యుచ్ఛక్తి ఉపయోగించి లోతైన బావుల నుంచి నీరు తోడుకొని వ్యవసాయం చేయడానికి వీలవుతుంది. దీనిని 1954లో మంజూరు చేస్తే, 1956లో రెండవ పంచవర్ష ప్రణాళికలో చేరిస్తే, 1962వ సంవత్సరం వచ్చే వరకు కూడా ఈ కార్యక్రమం ప్రారంభం కాలేదంటే ప్రభుత్వం ఏ కారణం చెబుతుంది? బహుశా విదేశీ మారకద్రవ్యం దొరకలేదంటారనుకుంటాను. అది1963లో వస్తుందేమో, 1964లో ప్రారంభం చేస్తారేమో. ఈ విధంగా ఆలోచించాల్సిందే తప్ప ఇదిగో 1963 డిశంబర్‌లోను, 1964 ఫిబ్రవరిలోను మేము ప్రారంభించి తీరుతాము అనే ధీమాతో మన ప్రభుత్వం ఎందుకు చెప్పలేకపోతోంది? దీనికి బాధ్యులెవరు? తప్పెవరిది? కేంద్ర ప్రభుత్వం అని వారు అనవచ్చు. అది సులభమే. ఎందుకంటే వారిక్కడ లేరు కనుక. కాని మనం మన కర్తవ్యాన్ని ఎంతవరకు నెరవేర్చాము? మనం బ్లూ ప్రింట్స్ ఎప్పుడు పంపాము? విదేశీ మారకద్రవ్యం కోసం మనం చేసిన ప్రయత్నాలేవి? ఏ ఏ కార్యక్రమాలు రూపొందించాము? ఏఏ చర్యలు తీసుకున్నాము? ఇవన్నీ ప్రజల ముందు పెడితే తప్పొప్పులను నిర్ణయించడానికి వీలవుతుంది. ఈ విధానం అవలంబించకుండా సూచనలు ఇవ్వమని అడగటం వల్ల ప్రయోజనమేమీ ఉండదు. పరిస్థితులు తెలుసుకోకుండా మేమివ్వగలిగే సూచనలు ఏముంటాయి? శాసనసభను విశ్వాసంలోకి తీసుకోండి. మీకున్న కష్టాలు చెప్పండి. అప్పుడు ప్రజల సహకారం అడగండి. ప్రజలు కూడా తమ పూర్తి సహకారం ఇవ్వడానికి అవకాశం ఉంది.

ఈనాడు ఆంధ్రదేశం చాలా ప్రమాదకరమైన ఆర్థిక పరిస్థితుల్లో ఉంది. వాస్తవం చెప్పాలంటే మనం వ్యవసాయ రంగంలో కూడా అభివృద్ధి చెందలేదని మనవి చేస్తున్నాను. ఈ విషయం గురించి ప్రభుత్వం జాగ్రత్తగా పరిశీలించవలసి ఉంది. దీని గురించి గవర్నర్‌గారి ప్రసంగంలో ఏ విధమైన ప్రస్తావనా లేకపోవటం చాలా శోచనీయం. ఇది వాస్తవ విరుద్ధమైన ఉపన్యాసం అని చెప్పక తప్పదు. అభివృద్ధి అన్ని రంగాలలోనూ చాలా నిదానంగా జరుగుతోంది. అభివృద్ధి వేగాన్ని మనం త్వరపడి పెంచకపోతే ముప్పు వాటిల్లుతుంది. అందుకని ప్రభుత్వం రాష్ట్ర ఆర్థిక పరిస్థితిని పునఃపరిశీలించవలసిన అవసరం ఉంది. ఆర్థిక విధానంలో ప్రధాన విషయాల మీద మన ప్రభుత్వం దృష్టిని కేంద్రీకరించి పని చేయవలసిన అవసరం ఉంది. ఇటువంటి సూచనలు లేకపోవడం వల్లనే గవర్నర్‌గారి ప్రసంగాన్ని, దీనికి కారణమైన ప్రభుత్వాన్ని నేను అభినందించలేక పోతున్నందుకు విచారిస్తున్నాను. ప్రభుత్వం జాగ్రత్తగా ఆలోచించి తగిన నూతన చర్యలు తీసుకోవడానికి ముందుకు వస్తుందని ఆశిస్తున్నాను. ✡

# తీవ్రమైన సంక్షోభంలో బిటి పత్తి రైతులు

వరంగల్‌జిల్లాలోని అనేక ప్రాంతాలలోనూ, పొరుగు జిల్లాలలోనూ ప్రత్తి పంటపై అధికంగా సోకే కాయ తొలుచు పురుగును నిరోధించి, అరికట్టేదిగా చెప్పబడే బిటి పత్తికి ఈ పురుగుసోకటంపై తెలంగాణా ప్రాంత రైతులు తీవ్ర కలవరానికి గురౌతున్నారు. 22-8-12న వరంగల్ జిల్లాలోని పత్తి పంటపొలాల్ని కొన్నింటిని పరిశీలించిన సీనియర్ వ్యవసాయ శాస్త్రవేత్త ఎల్.జగపతిరావు, గత కొద్దిరోజులుగా ఈ పురుగు సృష్టిస్తున్న విధ్వంసాన్ని వెలుగులోకి తెచ్చారు. పంట పూతకొచ్చే కీలక సమయంలో సాగుతున్న ఈ పురుగుదాడి, పంట మనుగడకే పెనువిపత్తుగా మారింది. పంట దిగుబడిని ఇది తీవ్రంగా ప్రభావితం చేస్తుందని ఆయన హైదరాబాదుకు తిరిగివచ్చిన అనంతరం 'ది హిందూ'కు తెలిపారు.

అలకంపేట గ్రామంలో పత్తిపై కాయతొలుచు పురుగును గమనించిన అనంతరం ఆయన, కేసముద్రం, నెక్కొండ, గూడూరు, నల్లబిల్లి, పర్వతగిరి మండలాల్లోని 20 గ్రామాల్లోనూ పరిశీలన జరిపారు. వాస్తవానికి, తమ మిరపపంటను చూడటానికి రావలసిందిగా కొందరు రైతుల ఆహ్వానం మేరకు ఆయన ఈ ప్రాంతానికి → వెళ్ళారు. అక్కడ పంటలను చూస్తుండగా, ప్రక్కనున్న ప్రత్తిచేలో మొగ్గలు అసాధారణంగా వాడిపోయి వుండటాన్ని గమనించి, వాటిలో కొన్నింటిని విచ్చదీసి చూడగా పురుగు వుండటాన్ని చూసి ఆశ్చర్యానికి గురయ్యారు. 'పురుగు బాగా లోనికి చొచ్చుకొని పోయివుంది. ఇదెలా సంభవించిందో నేను చెప్పలేను. బిటి పత్తి-II వాస్తవానికి ఈ పురుగును నిరోధించ వలసివున్నప్పటికీ మొగ్గలేకాక, ఆకులుకూడా ఈ దాడికి గురయ్యాయి' అని ఆయన పేర్కొన్నారు. ఆచార్య ఎన్.జి.రంగా వ్యవసాయ విశ్వవిద్యాలయం రిజిస్ట్రార్‌గా పదవీవిరమణ చేసిన డా॥రావుగారు, కాయతొలుచు పురుగుయొక్క ఈ హటాత్ దాడికి రెండు కారణాలుండ వచ్చునని చెప్పారు. "కాయ తొలుచు పురుగు బిటిపత్తికి లొంగని శక్తిని (రెసిస్టెన్సును) అభివృద్ధి చేసుకోవటమైనా గావాలి. లేదా, విత్తనాల నాణ్యతకు సంబంధించిన సమస్య అయినా కావాలి" అని ఆయన చెప్పారు. ఆయన తన పరిశీలనాంశాలతో కూడిన నివేదికను వ్యవసాయశాఖకు అందజేయటంతో పాటు, ఆ ప్రాంతంలో ప్రత్తిపంటపై క్షుణ్ణంగా అధ్యయనం చేసేందుకు సంబంధిత అధికారులను ఆ ప్రాంతం వెళ్ళి పరిశీలన జరప వలసిందిగా విజ్ఞప్తి చేశారు. 57 లక్షల ఎకరాలకు బిటి పత్తి పంట విస్తరించటంతో బిటి పత్తి వినియోగంలో ఆంధ్రప్రదేశ్ రాష్ట్రం ముందుండగా, పత్తి పండించే రైతులు తీవ్ర సంక్షోభాన్ని ఎదుర్కోనున్నారు.

**(కె.వెంకటేశ్వర్లు–25-8-12 'ది హిందూ' నుండి)** ✡

# 'దేశాన్ని ఏలుతున్న సామ్రాజ్యవాద అనుకూల పెద్దలు దేశానికీ, రాష్ట్రానికీ సమైక్యత, భావసమైక్యత చేకూర్చలేరు'

## ఆంధ్రప్రదేశ్ శాసనసభలో కా॥ తరిమెల నాగిరెడ్డి

*ఆంధ్రప్రదేశ్ శాసనసభలో కా॥ తరిమెల నాగిరెడ్డి చేసిన రెండు ఉపన్యాసాలను ఇక్కడ ప్రచురిస్తున్నాము. మొదటి ఉపన్యాసం ప్రత్యేక తెలంగాణా రాష్ట్రాన్ని కోరుతూ ఆనాడు వచ్చిన ఉద్యమం సందర్భంగా శాసన సభలో చేసింది. 1969 మార్చి 7,8,9, తేదీలలో శాసనసభలో దీనిపై చర్చ జరిగింది. దాదాపు సభ్యులందరూ తమ అభిప్రాయాలు తెలిపారు. పాలకపార్టీ అనుసరిస్తున్న సామ్రాజ్యవాద అనుకూల, భూస్వామ్య అనుకూల విధానాలను సంపూర్ణంగా మార్చుకోకుండా ప్రాంతీయ అసమానతలను తొలగించలేరనీ, ప్రగతి సాధ్యంకాదనీ ఆయన ఈ ఉపన్యాసంలో స్పష్టం చేశారు.*

*ఆనాడు విద్యార్థులూ, ఉద్యోగులూ ప్రత్యేక తెలంగాణా డిమాండును ముందుకు తెచ్చారు. జనవరి 19న ప్రభుత్వం అఖిలపక్ష సమావేశం జరిపింది. తెలంగాణా మిగులు నిధులు ఎన్ని వున్నాయో తేల్చేందుకు ఒక సీనియర్ అధికారిని నియమించాలనీ, కోస్తా ఆంధ్ర ప్రాంతంలో ఉద్యోగాలు కల్పించి, తెలంగాణా ప్రాంత ఉద్యోగాలలో వున్న ఆంధ్ర ఉద్యోగులను వెనక్కు పంపాలనీ అఖిలపక్ష సమావేశం నిర్ణయించింది. ఇది అమలుకాలేదు. ఈ ఒప్పందం పరిష్కారం కాజాలదని కా॥ టి.ఎన్. పేర్కొన్నారు. ఈ ఉపన్యాసం చేసిన తర్వాత నాలుగు రోజులకు (మార్చి11న) ఆయన తన శాసనసభ సభ్యత్వానికి రాజీనామా చేశారు.*

*రెండవ ఉపన్యాసంలో (1962 మార్చి 24న) గవర్నరు ప్రసంగానికి ధన్యవాదాల తీర్మానంపై మాట్లాడుతూ ప్రభుత్వ విధానాలను తూర్పారపట్టారు. ఎన్నికల నిర్వహణలో సాగుతున్న ధనం, మద్యం, అధికార దుర్వినియోగాలను ఆయన దీనిలో నిశితంగా విమర్శించారు.*

**– సంపాదకుడు**

**1969 మార్చి 7**

**అందరి** అభిప్రాయాలూ విన్నాను. నాకు భిన్నాభిప్రాయం ఉంది. దాని ప్రాతిపదికగానే పరిస్థితులను చక్కదిద్దేందుకు మార్గం అన్వేషించాలని నా సూచన. ప్రాంతీయ, వర్గ అసమానతలే ప్రస్తుత పరిస్థితులకు దోహదం చేశాయి. వీటన్నింటికీ కారణం–ప్రభుత్వం అనుసరిస్తున్న రాజకీయ, ఆర్థిక, సాంఘిక వ్యూహాలే. ఆ పరిస్థితిని మార్చాలంటే ప్రభుత్వం మొత్తంగా పాలనా విధానాన్ని, ప్రణాళికా విధానాన్ని మార్చుకోవాలి. తాత్కాలిక మార్పులు పరిష్కారం కాబోవు. పైరవీలు చేయగలగడమే ప్రజాస్వామ్యంలో అతిముఖ్యమని నరసింహారావుగారు చెప్పారు. అవును, నిజం. ఈ వ్యవస్థలో పైరవీలకే పెద్ద పీట. డబ్బున్నవారు, నోరున్నవారు, పలుకుబడి కలవారు మాత్రమే లాబీ చేయగలుగుతారు. ఇది ఈ ప్రజాస్వామ్య సంక్షోభానికి సంబంధించిన ఒక రోగ సూచన అని నేను అనుకుంటున్నాను. ఇప్పుడు నడుస్తున్నది పైరవీల ప్రజాస్వామ్యమే తప్ప, ప్రజల సమస్యలను పరిష్కరించే ప్రజాస్వామ్యం కాదు. ఇది ఇక్కడ మాత్రమే ఎదురవడం లేదు. దేశం మొత్తం మీద సమస్యలు పెరుగుతున్నాయి. కోపోద్రిక్తులైన ప్రజలు వీధుల్లోకి వస్తున్నారు. వారిని ఆటంకపరిచే ఏ రకమైన స్థోమతా తగినంతగా ఉండటం లేదు. అది రాను రాను తగ్గుతున్నది. ప్రాంతీయ అసమానతల గురించి మాట్లాడేవారు దానిని ఒక తాత్కాలిక సమస్యగానే పరిగణిస్తున్నారు. దేశంలో సామ్రాజ్యవాద అనుకూల ఆర్థిక విధానాలు అమలు చేయడంతో తెలంగాణాలో అభివృద్ధి కష్టమవుతుంది.

సామ్రాజ్యవాదుల ఒత్తిడులు, వారి అవసరాలు, లాభతృష్ణ వల్లనే ఇక్కడ మనం పరిశ్రమలు పెట్టలేక పోయాము అనేది నిజం కాదు. 1956లో కొత్తగూడెంలో ఎరువుల కర్మాగారం పెట్టడం న్యాయమని పరిశీలనలో సూచించారు. ఆ తరువాత మరొక అనువైన చోటు విజయవాడ అన్నారు. అందులో విశాఖ ప్రస్తావనే లేదు. అయినా విశాఖపట్టణానికి ఎరువుల ఫ్యాక్టరీ వచ్చేసింది. మరొక ఫ్యాక్టరీకి లైసెన్సు కూడా ఇచ్చేశారు. ఇది ఎలా జరిగింది? దేశ అవసరాలనుబట్టి ఇచ్చారా? లేక ఇక్కడున్న ముడి సరుకులను పూర్తిగా ఉపయోగించుకో గల అవకాశం కొత్తగూడెంలో లేదని, విశాఖలో ఉందని ఆలోచించి ఇచ్చారా? అమెరికా నుండి వచ్చే అమోనియాను, నాఫ్తాను వినియోగించుకోవడానికి విశాఖపట్టణం ఎరువుల ఫ్యాక్టరీకి లైసెన్సు ఇస్తే ఇక్కడున్న ఆంధ్రదేశ భక్తులు ఆ అన్యాయం గురించి నోరెత్తలేదు. అదే ఎరువుల ఫ్యాక్టరీని కొత్తగూడెంలో పెట్టి వుంటే ముడిసరుకుల సరఫరా రూపంలో స్థానిక ప్రజలకు ఉపాధి అవకాశం పెంచగలిగేవారు. అలాగే బొగ్గు గనుల మూసివేతను ఆపగలిగేవారు. దానిని ఎవరూ పట్టించుకోరు.

ప్రాంతీయ అసమానతల వల్ల నేడు దేశంలో అనైక్యత ఉద్భవించింది. ఈ నేపథ్యంలో మరోసారి ఇక్కడ సామ్రాజ్యవాద వ్యతిరేక విప్లవం జరిగితే తప్ప దేశం విచ్ఛిన్నమై పోతుంది. కానీ దేశ సమగ్రతకు దారితీసే పరిస్థితి రాదు. ప్రస్తుతం దేశాన్ని ఏలుతున్న సామ్రాజ్యవాద అనుకూల పెద్దలు ఈ దేశానికి సమైక్యత, భావ సమైక్యత చేకూర్చలేరు.

ఇంతకుముందు చర్చలో భూసంస్కరణల ప్రస్తావన కూడా వచ్చింది. ఆ చట్టం రావడానికి ప్రధాన కారణం వీరోచిత పోరాటాలే. తెలంగాణా ప్రజలు ఆనాడు పోరాటం చేయడం వల్ల విధిలేక ఆ చట్టం తెచ్చారు తప్ప, అమలు చేయడానికి తెచ్చిన చట్టం కాదది. ఆ చట్టం రాగానే జమీందారులు తమ భూములు పోతాయనే భయంతో దొరికిన వారందరికీ వాటిని అమ్మివేశారు. నిజంగా ఆ చట్టాన్నే అమలు చేసి వుంటే, భూములు పంచి వుంటే ఈనాడు ఈ పరిస్థితి ఎదురయ్యేది కాదు.

అసలు విషయమేమిటంటే ఈ జాతి స్వాతంత్ర్యం, సమైక్యత, అభివృద్ధి అనేవి ప్రజల యిష్టాఇష్టాల మీద ఆధారపడి లేవు. ఢిల్లీకి రాష్ట్రం అప్పుపడి ఉందని ప్రభుత్వం తన బడ్జెట్‌లో పేర్కొంది. ఈ రాష్ట్రం ఢిల్లీకి 100 కోట్ల అప్పు ఉంటే, ఢిల్లీవారు ఆపై వారికి వేల కోట్ల బాకీ ఉంటారు. అసలు సంగతేమిటంటే 1940ల కంటే ఈ రోజు దేశం నుంచి మన ఆర్థిక వనరుల తరలింపు పెరిగిపోయింది. దానిని ఆపకుండా అభివృద్ధి అసాధ్యం.

ఇప్పుడే ఈ తిరుగుబాట్లు ఎందుకు వస్తున్నాయి? నాలుగేళ్ళ క్రితం ఎందుకు లేవు? ఎందుకంటే సంక్షోభం ఉధృతం అవడం వల్లనే కదా. వ్యాధి ముదిరేకొద్దీ రోగికి బాధ పెరుగుతుంది. నేటి సమాజంలో సంక్షోభం ఆ దశకు చేరుకుంది. 1947 నుంచి నేటి వరకు సామ్రాజ్యవాద, భూస్వాముల అనుకూల విధానాలను, కార్యక్రమాలను అమలు చేశారు. దాని వల్ల సంక్షోభం మరింత పెరుగుతోంది. మీలో చాలామంది నాతో ఏకీభవించలేకపోవచ్చు. ఈ ప్రాంతీయ, వర్గ అసమానతలు, నిరుద్యోగం, ఆర్థిక సంక్షోభం, విదేశాలపై ఆధారపడటం, వాటికి ఊడిగం చేయడం వంటి రుగ్మతలు పోవడం అనేది ప్రజావిప్లవం ద్వారానే సాధ్యం.

ఈ రోజు వచ్చిన తిరుగుబాటు (ఆనాడు ప్రత్యేక తెలంగాణా డిమాండుతో సాగిన ఉద్యమం–సం) ప్రజల అసంతృప్తికి అద్దం పడుతోంది. కానీ అది సరైన దారిలో వెళుతోందా అంటే లేదనే చెప్పాలి. అయితే ఈ ఉద్యమం ప్రజలలో ఆలోచనలు రేకెత్తిస్తోంది. కొందరు స్వార్థపరులు దానిని తప్పుదారికి మళ్ళించవచ్చు. అయితే అది ఎంతోకాలం సాగదు. సంక్షోభం ముదిరిన కొద్దీ దానినుంచి ఎలా బయటపడాలా అని జనం ఆలోచిస్తారు. ఇది సంక్షోభాలు పెరుగుతున్న సమయం. సమస్యను ఇలా అర్థం చేసుకుంటే తప్ప దాని నుంచి మనం బయటపడం.

జనవరి 19 నాటి ఒప్పందం అంతిమ పరిష్కారం కాజాలదు. క్యాన్సర్ రోగికి తలనొప్పి వస్తే అమృతాంజనం వల్ల ఆ నొప్పి తగ్గవచ్చేమోగాని అసలు బాధ తగ్గదు. మహారాష్ట్రలో శివసేన, ఇక్కడ తెలంగాణా సమస్య, అక్కడ బెంగాల్–బీహార్, ఇటు మైసూర్–మహారాష్ట్రల మధ్య సరిహద్దుల తగాదాలు చూస్తున్నాము. ఇది ఈ ప్రభుత్వం అనుసరిస్తున్న 20 ఏళ్ళ తప్పుడు విధానాల ఫలితం. మరోదేశంపై మనం ఆధారపడవలసిన దుస్థితి కలగడానికి ఈ 20ఏళ్ళ విధానాలే దోహదం చేశాయి.

ఈ రోజు మనకు ఆర్థిక స్వావలంబన లేదు. రాజకీయపరంగా చూసినా స్వతంత్రులం కాదు. ముందే చెప్పినట్లుగా సంక్షోభం ముదురుతోంది. నిర్మాణాత్మక సూచన ఇవ్వమని కోరితే నేను ఒకటే చెప్పగలను. ఈ ప్రభుత్వం తన విధానాలను తలక్రిందులు చేయాలి. అదొక్కటే మార్గం. కాని వారు ఆ సూచనను అమలు చేయలేరు. అది నిర్మాణాత్మక విమర్శ కాదంటారు. అలాంటి విమర్శ ఎలా చేయను. అసాధారణ పరిస్థితులు ఉన్నాయి. దివాళా తీసిన ప్రభుత్వం 10 వేల మందికి ఉద్యోగాలివ్వమంటే ఇవ్వగలరా? వెంటనే పోచంపాడు ప్రాజెక్టును కట్టమని చెప్పడం నిర్మాణాత్మక సలహాయే. కానీ అన్ని కోట్లు ఎక్కడ నుంచి తెస్తారు? అప్పు తెస్తారా? ఇలాంటప్పుడు నిజంగా నిర్మాణాత్మక సూచన కావాలంటే ముందు ప్రభుత్వం తన విధానాలను పై నుంచి అట్టడుగు స్థాయిదాకా మార్చుకోవాలి. భూస్వాములకు, సామ్రాజ్యవాదులకు వ్యతిరేకంగా కొత్త విధానాలు రూపొందించాలి. అప్పుడే అభివృద్ధికి కావలసిన నిధులు సమకూరుతాయి. అప్పుడు మాత్రమే ప్రజలను ప్రగతికృషి చేసేలా మీరు ప్రోత్సహించగలరు. అప్పుడు మాత్రమే ఈ దేశ, రాష్ట్ర సమైక్యత పటిష్టమవుతుంది. అలా జరిగితే నేనెంతో సంతోషిస్తాను.

# గవర్నరు ప్రసంగానికి ధన్యవాదాల తీర్మానంపై ఉపన్యాసం

**1962 మార్చి 24**

**గవర్నర్** తన ప్రసంగంలో రాష్ట్ర ఆర్థిక రాజకీయ పరిస్థితులను సమీక్షించి భావి కార్యక్రమాలపై ఒక వివరణ ఇస్తారని ఆశించాను. ఆ ఆశతోనే ప్రసంగాన్ని జాగ్రత్తగా విన్నాను. కానీ అది అత్యాశ అని తేలిపోయింది. రాష్ట్ర పురోభివృద్ధి గురించి ప్రస్తావిస్తూ, ఈ విషయంలో అన్ని పక్షాల వారికి సమానమైన బాధ్యత ఉందని, ఆ బాధ్యతను నెరవేర్చేందుకు సభ్యులంతా పరస్పరం సహకరించు కుంటూ సహనంతో కృషి చేస్తారని ఆశిస్తున్నట్లు గవర్నర్ చెప్పారు. అయితే ఎన్నికల నిర్వహణలో ప్రభుత్వం కొన్ని కీలకమైన ప్రజాస్వామ్య సూత్రాలను విడనాడింది అనే నిజాన్ని ప్రజల ముందు, ప్రభుత్వం ముందు ఉంచవలసిన కర్తవ్యం ప్రతిపక్షానికి ఉంది. ఇంతకు ముందు జరిగిన ఎన్నికలకు, ఈసారి ఎన్నికలకు మధ్యగల తేడాను అర్థం చేసుకునే పరిస్థితిలో మనం లేము. ఆంధ్రరాష్ట్రానికి అన్ని రకాల ఎన్నికల్లో అనుభవం ఉంది. 1952లో, 55లో, 57లో ఇప్పుడు 1962లో ఎన్నికలు జరిగాయి. ఈ నాలుగు ఎన్నికల నిర్వహణలో పద్ధతుల్లో తేడా ఏమైనా ఉందా, లేదా? 1962లో డబ్బు హెచ్చుగా ఖర్చు చేయాల్సి వచ్చింది. అంటే రాజకీయ ప్రచారం ఉధృతంగా సాగిందా? రాజకీయ ప్రచారం ద్వారా ఎన్నికలు నడపడం ప్రజాస్వామ్య పురోగతికి అవసరం. ఈసారి రాజకీయ ప్రచారం జరుగకుండా అభ్యర్థులు డబ్బు మీదో, సారా మీదో ఆధారపడ్డారు. మునుపటి ఎన్నికల నాటికి–ఇప్పటికి ఈ మార్పు ఎందుకొచ్చింది? 1955 ఎన్నికల్లో కమ్యూనిస్టులు ఓడిపోయినప్పుడు ఇప్పుడు జరిగినట్లు జరుగలేదు. ఆ రోజున బ్రహ్మాండమైన రాజకీయ ప్రచారం సాగింది. ఈసారి కమ్యూనిస్టులమైన మేము మాత్రమే రాజకీయ ప్రచారం జరిపాము తప్ప ప్రభుత్వ పక్షం నుండి ఆ తరహా ప్రచారం జరుగలేదు. నా నియోజకవర్గంలో మేము, కమ్యూనిస్టు పార్టీ వాళ్ళము 62 మీటింగులు పెట్టాము. కాంగ్రెస్‌వారు సంజీవరెడ్డిగారు వచ్చేంత వరకు ఒక్క మీటింగ్ కూడా పెట్టలేదు. ఆ ఒక్క మీటింగ్ తప్ప వాళ్ళు మరో సమావేశం జరుపలేదు. ప్రభుత్వం వారు తవ్వుతున్న కాలువల్లో నీరు లేదు. వాటి బదులు ఎన్నికల సమయంలో డబ్బు, సారా ప్రవహించాయి. అది ప్రజాస్వామ్యానికి విరుద్ధం, నష్టం, ప్రమాదం అని కూడా హెచ్చరిస్తున్నాను. ఈ హెచ్చరికను ప్రభుత్వ పక్షం సవినయంగా స్వీకరించాలి. ప్రభుత్వంలో ఉన్న పార్టీ, ఎన్నికలు నిర్వహిస్తున్నప్పుడు నిష్పక్షపాతంగా వ్యవహరించ వలసిన బాధ్యత ప్రభుత్వంపై ఉంది. ఎన్నికల సమయంలో అధికారంలో ఉన్న పార్టీ రాజీనామా చేస్తే వేరే సంగతి. బ్రిటన్‌లో మాదిరి ఎన్నికలకు మన మంత్రి వర్గం రాజీనామా ఇవ్వాలి. అలా జరగటం లేదు. ఈ దృష్ట్యా మంత్రివర్గం, ప్రభుత్వం మరింత మెలకువగా వ్యవహరించాలి.

అయితే ఎన్నికల సమయంలో ప్రభుత్వ పెద్దలు ఎన్ని నిర్మాణాలకు శంకుస్థాపన చేశారో, ఎన్ని ప్రాజెక్టులు ప్రారంభించారో ముఖ్యమంత్రి లెక్కలు తీసి ఇవ్వగలరా? పాత బడ్జెట్‌లో లేని కొత్త పథకాలను సవరించిన బడ్జెట్‌లో చేర్చి తక్షణమే 1000 రూపాయల చొప్పున మంజూరు చేసి అప్పటికప్పుడు ప్రారంభోత్సవాలు చేశారు. అయితే బడ్జెట్ పత్రాల్లో ఆ స్కీములకు దమ్మిడీ కూడా శాంక్షన్ కాలేదు. దీనిని బట్టి చూస్తే ప్రభుత్వం ఎన్నికల్లో తన అధికారాన్ని దుర్వినియోగం చేసినట్లా, కాదా? ఉదాహరణకు తుంగభద్ర ఎగువ కాలువ రెండు దశల తవ్వకాల తరువాత పులివెందుల కాలువకు నీరు ఉండదని ప్రభుత్వమే ప్రకటించింది. అయితే ఎన్నికలు రావడంతో పులివెందుల కాలువకు సవరించిన అంచనాల్లో 1000 రూపాయలు కేటాయించి ఒక పునాదిరాయి వేశారు. మరి బడ్జెట్‌లో మాత్రం ఆ కాలువ తవ్వడానికి పైసా కూడా మంజూరు కాలేదు. ప్రభుత్వ పక్షం ఎన్నికల్లో తన యంత్రాంగాన్ని ఉపయోగించు కుంది. అలా చేయడం తప్పని నా ఉద్దేశ్యం. ఎన్నికల్లో కాంగ్రెస్ నాయకులు పార్టీవారుగా కాకుండా మంత్రులుగా, ప్రభుత్వ ప్రతినిధులుగా ప్రజల వద్దకు వెళ్ళి వాగ్దానాలు చేశారు. అలాగే తమకు అనుకూలంగా ఉండని పోలీసు అధికారులను బయటకు పంపి, తమకు పనికి వచ్చేవారినే నియమించుకున్నారు. ప్రభుత్వం ఈ అంశాన్ని జాగ్రత్తగా పరిశీలించి ఆత్మవిమర్శ చేసుకోవాలి. నెహ్రూగారే స్వయంగా ఒప్పుకున్నారు: "ఈ దేశంలో ఫ్యూడల్ శక్తులు, భూస్వామ్య శక్తులు ఇంకా బలంగానే ఉన్నాయి. అందుచేతే కొన్ని ప్రాంతాల్లో ఎన్నికలు ప్రజాస్వామ్యబద్ధంగా జరిపేందుకు వీలులేని పరిస్థితి ఏర్పడింది. అందువల్ల ఫ్యూడల్ శక్తుల ప్రభావం పూర్తిగా తొలగిపోలేదు". అది నెహ్రూ ఉద్దేశ్యం. ఈ శక్తులు ఎన్నికల సమయంలో చూపిన ప్రభావాన్ని అర్థం చేసుకోవాలి. లేకుంటే ప్రజాస్వామ్యాన్ని మనం రక్షించుకోలేము.

పాకిస్తాన్, నేపాల్, బర్మాలలోనే కాదు... ఈ ప్రమాదం సిలోన్‌లో కూడా వస్తుండటం మనం చూస్తూనే ఉన్నాము. మన చుట్టూ ఉన్న దేశాల్లో ప్రజాస్వామ్యం ప్రమాదకరమైన పరిస్థితులను ఎదుర్కొంటున్న నేపథ్యంలో మన దేశంలో ప్రజాస్వామ్యాన్ని పరిరక్షించుకోవడానికి ఏది పద్ధతి? అనే విషయాన్ని జాగ్రత్తగా అందరం పరిశీలించవలసిన సమయంలో నేను చేస్తున్న విమర్శ సక్రమమైనది, పరిశీలించవలసిందని ముఖ్యమంత్రిగారిని, వారి మంత్రివర్గాన్ని కోరుతున్నాను. కమ్యూనిస్టులు రజాకార్లతో చేతులు కలిపారని సత్యదూరమైన ఆరోపణ ఒకటి చేశారు. దాని గురించి నేను చెప్పను. నెహ్రూగారి ఆంతరంగిక మిత్రులు అయిన కచ్రూ అనే ఆయన తెలంగాణాకు వచ్చి కమ్యూనిస్టుల మీద, కమ్యూనిస్టుల ఉద్యమాల మీద, రజాకార్ల మీద ఇచ్చిన నివేదికలు చూడండి. కమ్యూనిస్టు పార్టీ–మేము– ఆనాడు రజాకార్ల ఉద్యమాన్ని ఎంత తీవ్రంగా ప్రతిఘటించవలసి వచ్చిందో, ఆనాడు కాంగ్రెస్‌వారు వారిని తట్టుకోలేక ఇతర రాష్ట్రాలకు ఏ విధంగా వెళ్ళవలసి వచ్చిందో– ఆ విషయాలు నేను చెప్పడం కన్నా, నెహ్రూగారి ఆంతరంగిక మిత్రులు ఆయన కచ్రూగారి నివేదిక చూడండి. రజాకార్ల ఉద్యమానికి ప్రతిఘటనా శక్తి కమ్యూనిస్టు పార్టీయా లేకా మీరా అన్నది అందరికీ తెలుసు. మీరు కొంచెం సత్య పరిశీలన చేయండని నేను కోరడం తప్ప వేరే చెప్పగలిగింది లేదు.

కమ్యూనిస్టు పార్టీవారు దాడులు చేశారని ఆరోపణలు చేశారు. అధికారంలో ఉండే పార్టీ, ప్రతిపక్షం దాడులు చేస్తోందంటే ఎవరైనా నమ్ముతారా? దాడులు చేసే పరిస్థితులుంటే కాంగ్రెస్‌వారు ఇక్కడ ఉండనిస్తారా? మేము ఉంటామా? నేను చెప్పేది దాడులు చేసిన రోజులు లేవని కాదు. ఆత్మరక్షణ కోసం దాడులు చేసిన రోజులున్నాయి. కమ్యూనిస్టు పార్టీవాళ్ళు ఈ ఎన్నికలలో కాంగ్రెస్‌వారు దౌర్జన్యం చేసిన కారణం వల్లే ఓడిపోయారు అని నేరారోపణ చేయడం లేదు. ఓడిపోవడానికి కాంగ్రెస్‌వారే కారణం అని చెప్పుకునే స్థితిలో కమ్యూనిస్టు పార్టీ ఉన్నదని కాదు. కమ్యూనిస్టు పార్టీగాని, ప్రతిపక్షాలుగాని ఇలాంటి శక్తులనన్నింటినీ ఎదుర్కొని ప్రజాస్వామికంగా ఎన్నిక కావడానికి ప్రయత్నిస్తున్నాము. అందుకోసం కృషి చేస్తున్నాము. దాడులు చేసిన చోట్ల గెలిచాము. దాడులు చేయని చోట్ల కూడా గెలిచాము. దాడులుచేయని కొన్ని చోట్లలోనూ మేము ఓడిపోయాము. దాడులు చేయలేదు కాబట్టి మేమన్ని చోట్లా గెలిచాము అని కాదు. కొన్ని ఫ్యూడల్ శక్తులు ముఖ్యంగా తెలంగాణా జిల్లాల్లో ప్రజాస్వామ్యానికి చేటు కలిగించే శక్తులు ఉన్నాయి. ఆ శక్తులు ప్రధానంగా కాంగ్రెస్ పార్టీలో ఉన్నాయి. ఆ శక్తులు ప్రభుత్వ యంత్రాంగాన్ని వినియోగించుకొని ప్రజాస్వామ్యానికి హాని చేశాయి. దీనిని జాగ్రత్తగా పరిశీలించండి అని ఈనాడు అధికారంలో కూర్చున్న వాళ్ళను అడుగుతున్నాను. నిన్న అధికారంలో ఉన్నవాళ్ళు కూడా ఈనాడు ఇక్కడ ఉన్నారా, లేరా అన్నది కాదు. మొత్తం మీద మన ప్రభుత్వం ఒక పార్టీకి సంబంధించింది కాబట్టి దీనిని జాగ్రత్తగా పరిశీలించడం **(తరువాయి 2వ పేజీలో)**

# పెట్టుబడిదారి, సామ్రాజ్యవాద శక్తుల కుతంత్రమే జీవ వైవిధ్య విధ్వంసం

ప్రొ॥కె.ఆర్.చౌదరి

**జీవ భద్రత,** జీవ వైవిధ్యం చాలా ప్రాముఖ్యత గల అంశాలు. హైదరాబాద్‌లో అంతర్జాతీయ జీవ వైవిధ్య సదస్సు అక్టోబర్ ఒకటవ తేదీ నుండి 19వరకు జరుగుతోంది. ఈ సదస్సులో మొదటి ఐదు రోజులు జీవభద్రత గురించి చర్చలు జరిగాయి. ఈ అంశంపై గతంలోనూ చర్చలు జరిగాయి. జన్యుమార్పిడి జీవాలు-జీవవైవిధ్యం, జీవభద్రత, మానవుల ఆరోగ్యం, సామాజిక, ఆర్థిక పరిస్థితులు, పర్యావరణంపై ప్రగాఢమైన దుష్ప్రభావం కల్గిస్తాయని వర్థమాన దేశాలు, పర్యావరణ వేత్తలు, వ్యవసాయ శాస్త్రవేత్తలు, జీవవైవిధ్య నిపుణులు తీవ్రమైన ఆందోళన వ్యక్తంచేస్తున్నారు. జన్యుమార్పిడి జీవాలను పర్యావరణంలోకి ప్రవేశపెట్టితే ముప్పు తప్పదు. జన్యుమార్పిడి పంటలవల్ల జరిగే నష్టాల్ని శాస్త్రజ్ఞులు ఏకరువు పెట్టారు. బిటి పత్తి-రైతాంగానికి, పర్యావరణానికి కలిగించిన విఘాతం జగద్విదితం. జన్యుమార్పిడి పంటల్లో దిగుబడులను పెంచే జన్యుకణం లేదు. అందువల్ల, పైర్ల దిగుబడులు పెరగవు. బిటి పత్తిలో ఒకే ఒక్క పురుగు (శనగపచ్చ పురుగు)ను తట్టుకునే శక్తి వుందని మొదట్లో కంపెనీవాళ్ళు బుకాయించారు. ఇది కూడా అబద్ధమని తేలింది. బిటి మొదటి రకం రెండు మూడేళ్ళలోనే పురుగును తట్టుకునే శక్తిని కోల్పోయినందువల్ల బిటి రెండు, బిటి మూడు రకాలు వచ్చాయి. బిటివల్ల దిగుబడులు పెరగవని రుజువయింది. పైగా, వర్షాభావ పరిస్థితులను తట్టుకునే సామర్థ్యం కూడా లేదు. ఆర్థికంగా లాభదాయకంగా లేదు. రైతులు నష్టాలకు గురి అయి, ఆత్మహత్యలు చేసుకున్నారు. నేడు 95శాతం బిటి రకం పత్తి సాగులో వుంది. పత్తి రకాలన్నీ కనుమరుగయ్యాయి. జీవవైవిధ్యాన్ని నాశనం చేయడమే కాదు, జన్యు కాలుష్యాన్ని, పర్యావరణాన్ని ముఖ్యంగా నేల, నీరు, గాలిని కాలుష్యం బారినపడవేస్తుంది.

అనేక కోణాల నుంచి 'జీవభద్రత'ను పరిశీలించాలని వర్థమాన దేశాల ప్రతినిధులు, అభివృద్ధి చెందిన దేశాలకు సంబంధించిన కొంతమంది శాస్త్రజ్ఞులు కూడా కోరుతున్నారు. జన్యుమార్పిడి జీవాల బదిలీ, నిర్వహణ, గుర్తింపు, వీటివల్ల వచ్చే ముప్పు లేదా నష్టాల అంచనా, నష్టాలు సంభవిస్తే ఇవ్వాల్సిన పరిహారం, వివాదాల పరిష్కారం, సామాజిక, ఆర్థిక అంశాలు, జీవవైవిధ్యం, ప్రకృతి వనరులు, పర్యావరణంపై పడే దుష్ప్రభావం మొదలైన వాటిపై చర్చించాలని వర్థమాన దేశాల ప్రతినిధులు పట్టుబట్టినప్పటికీ, అది జరుగలేదు. జన్యుమార్పిడి పంటలతో నష్టాలు వస్తే దానికి బాధ్యత ఎవరు వహిస్తారు? ఎవరు నష్టపరిహారం చెల్లిస్తారు? ఎంత మొత్తం చెల్లిస్తారని నిలదీస్తే, దానికి జవాబు లేదు.

జన్యుమార్పిడి పంటల అనుకూల వర్గాలు, ముఖ్యంగా బయోటెక్ కంపెనీలు ఎదురుదాడికి దిగాయి. జన్యుమార్పిడి పంటలు ఆహార సమస్యను తీర్చుతాయనీ, రైతుకు విశేష లాభాలు తెచ్చి పెడతాయనీ, వీటివల్ల పర్యావరణానికి ముప్పురాదనీ, మానవుల ఆరోగ్యానికి ప్రమాదం లేదనీ బయోటెక్ కంపెనీలు, అగ్రరాజ్యాల ప్రతినిధులు వాదిస్తున్నారు. వీరికి మన దేశంలోని కొంతమంది అమ్ముడుపోయిన శాస్త్రజ్ఞులు వత్తాసు పలుకుతున్నారు. జన్యుమార్పిడి పంటల ఉత్పత్తులను మన దేశంలాంటి వర్థమాన దేశాల్లోకి ప్రవేశపెట్టడానికి, వ్యాపారం చేసుకోవడానికే అగ్రరాజ్యాలు, బహుళజాతి కంపెనీలు హైదరాబాద్ సదస్సును వేదికగా చేసుకున్నాయి.

నిజానికి, జీవ భద్రతపైన నియమ, నిబంధనలను (ప్రొటోకాల్సును) గతంలోనే జరిగిన నగోయా, కౌలాలంపూర్ సదస్సులోనే రూపొందించారు. వీటిని సామ్రాజ్యవాద దేశాలు వ్యతిరేకించాయి. అమెరికా సంతకం కూడా పెట్టలేదు. కేవలం 40 దేశాలు మాత్రమే సంతకం పెట్టాయి. ఏ ఒక్క దేశమూ ఈ నియమ నిబంధల్ని అమలుచేయలేదు. ప్రస్తుత సదస్సులో వీటిని మరలా ప్రస్తావించి, తీర్మానాలు చేసినప్పటికీ ప్రయోజనం శూన్యం. సామ్రాజ్యవాద దేశాలు వీటిని గౌరవించి, అమలు చేస్తేనే ప్రయోజనం వుంటుంది. ఈ పరిస్థితుల్లో, ఆయా దేశాలు జీవభద్రతకు తామే చట్టాలు చేసుకొని, అమలుచేస్తూ, సామ్రాజ్యవాద శక్తుల, బహుళజాతి కంపెనీల దాడులను తిప్పికొట్టాలి.

ఇక రెండో అతి ముఖ్యమైన అంశం జీవవైవిధ్యం. జీవ భద్రత లేకపోతే, జీవవైవిధ్యం విధ్వంసం కాకతప్పదు. జీవవైవిధ్యానికి ఉష్ణమండల వర్షపు అటవీ ప్రాంతాలు (ట్రాపికల్ రెయిన్ ఫారెస్టు ఏరియాస్) పుట్టినిల్లు. 95శాతం జన్యుసంపద ఈ ప్రాంతంలోనే వుంది. భారతదేశం ఈ ప్రాంతంలో భాగమే. లక్షలాది వృక్షజాతుల మొక్కలు, పశుజాతులు, పక్షిజాతులు, పురుగులు, సూక్ష్మక్రిములు మొదలైన జన్యుసంపద మనదేశంలో అపారంగా వుండేది. జీవరాశుల మనుగడకు భూమి, నీరు, గాలి అత్యంత అవసరం. జీవవైవిధ్యం జీవరాశుల మనుగడకు అవసరం. ఆహార భద్రతకు, సేంద్రియ వ్యవసాయానికి జీవవైవిధ్యం పునాది. వాతావరణ మార్పులవల్ల కలిగే ఉపద్రవాలను తట్టుకోడానికి జీవవైవిధ్యం అవసరం. మానవ మనుగడకు, అభివృద్ధికి జీవ వైవిధ్యం పునాది.

అలాంటి జీవ వైవిధ్యం విధ్వంసానికి గురి అయింది. జన్యు సంపద తరిగిపోయింది. రోగాలను, పురుగులను, వర్షాభావ పరిస్థితులను, అధిక వర్షాలు, ముంపు పరిస్థితులను తట్టుకుని అధిక దిగుబడులను ఇచ్చే నూతన పైర్ల రకాలను రూపొందించడానికి జీవవైవిధ్యం లేదా జన్యుసంపద అవసరం. వ్యవసాయాభివృద్ధికి జీవ వైవిధ్యానికి అవినాభావ సంబంధం వుంది. మనదేశంలో అనేక పైర్లలో వేలకొద్దీ రకాలు వుండేవి. ఉదాహరణకు, వరిలో 65,000, కందిలో 40,000, వంకాయలో 3000 రకాలు వుండేవి. ఈనాడు రైతులవద్ద వరిలో 10, కందిలో 4 లేదా 5, వంకాయలో 10 రకాలకంటే ఎక్కువ లేవు. అన్ని పంటల్లోనూ ఈ దుస్థితి వుంది. పశువుల్లోనూ అనేక జాతులు వుండేవి. ఆయా ప్రాంతాల్లో ఆ ప్రాంతాలకు అనువైన పశుజాతులుండేవి. ఒంగోలు జాతి, పలమనేరు జాతి, సుర్తి, పండరీపురి, కంగయాం, హళ్ళికేరి మొదలైన పశుజాతులు వుండేవి. అవన్నీ నామరూపాలు లేకుండా పోయాయి. మేకలు, గొర్రెలు, కోళ్ళు మొదలైన వాటిలో కూడా దేశవాళీ జాతులు వుండేవి. ఈ జాతులు అతికొద్దిగా మిగిలి వున్నాయి. అట్లాగే, మానవాళికి ఉపయోగపడే పక్షిజాతులు, వన్యప్రాణులు, పురుగులు, సూక్ష్మక్రిములు నశించిపోయాయి. అనేక ఉపయోగాలున్న అడవులు అంతరించిపోతున్నాయి. లక్షలాది సూక్ష్మక్రిములకు నిలయమైన భూమి క్షీణించిపోతోంది. కొండలు, గుట్టలు తరిగిపోతున్నాయి. నదులు ఎండిపోతున్నాయి. ప్రకృతి వనరులు దోపిడీకి గురి అవుతున్నాయి. పర్యావరణం క్షీణించిపోతోంది. జీవవైవిధ్యం విధ్వంసం అవుతోంది.

జీవవైవిధ్య విధ్వంసానికి కారకులు సామ్రాజ్యవాద దేశాలు, బహుళజాతి కంపెనీలు, భారత బడా పెట్టుబడిదారులు, దేశీయ కార్పోరేట్ కంపెనీలు. మిలాఖత్‌దారులు వీరికి తోడు దొంగలు. పేద దేశాల్లోని సహజవనరుల్ని, సకల సంపదలను, జీవ వైవిధ్యాన్ని తమ లాభాలకోసం, ప్రయోజనాలకోసం, భోగలాలసత్వాల కోసం, విలాస జీవితాలకోసం, ఆధిపత్యంకోసం సామ్రాజ్యవాద దేశాలు దోపిడీ చేస్తున్నాయి. పీడిత దేశాల ప్రభుత్వాలు కూడా ఈ దోపిడీలో భాగస్వాములే.

సామ్రాజ్యవాద దేశాలు, బహుళజాతి కంపెనీలు అనేక పద్ధతులద్వారా మన జన్యు సంపదను జీవ వైవిధ్యాన్ని దోపిడీ చేస్తున్నాయి. విధ్వంసాన్ని కూడా కలిగిస్తున్నాయి. సాంకేతిక విజ్ఞానాన్ని అమెరికా తదితర సామ్రాజ్యవాద దేశాలు మన నెత్తిపై రుద్దాయి. సస్యవిప్లవం పేరిట ఈ సాంకేతిక విజ్ఞానాన్ని మనకు అంటగట్టారు. కొత్తపైర్ల రకాలు, రసాయనిక ఎరువులు, పురుగు మందులు, వ్యవసాయ పరికరాలు, యంత్రాలు-ఇవీ సస్య విప్లవ సాంకేతిక విజ్ఞానం. ఇది మన వ్యవసాయంపైన, జీవవైవిధ్యంపైన దుష్ప్రభావాన్ని కలుగచేసింది. పాత పంటలు, పలురకాల పంటలు పోయి, ఏక పంట విధానం అమల్లోకి వచ్చింది. అనేక పైర్ల రకాలు అంతరించాయి. రసాయనిక ఎరువులు, పురుగుమందుల వాడకంవల్ల భూమి కలుషితమయింది. నిస్సారమయింది. భూమిలో వుండి మేలుచేసే పురుగులు, సూక్ష్మక్రిములు నశించాయి. పశువులు కూడా దెబ్బతిన్నాయి. పురుగు మందులవల్ల పక్షులు కూడా చనిపోతున్నాయి. భూగర్భజలాలు అడుగంటాయి. కలుషితమయ్యాయి. తమ రసాయనిక ఎరువుల్ని, పురుగుమందుల్ని, యంత్రాలను అమ్ముకోవడంకోసం సామ్రాజ్యవాద దేశాలు చేసిన కుట్రే ఈ సస్యవిప్లవం. పారిశ్రామిక, రసాయనిక వ్యవసాయం సామ్రాజ్యవాద దేశాలు మనకు తగిలించిన తెగులు. తర్వాత హైబ్రిడ్ విత్తనాలు వచ్చాయి. ఇప్పుడు జన్యుమార్పిడి పంటల్ని సామ్రాజ్యవాద బహుళజాతి కంపెనీలు మనకు అంటగట్టాయి. అందువల్ల, మన జన్యుసంపద, జీవవైవిధ్యం తరిగిపోవడానికి సాంకేతిక విజ్ఞానం కూడా సామ్రాజ్యవాదులకు తోడ్పడుతోంది. ఆహార పంటల స్థానంలో భారీఎత్తున వాణిజ్యపంటల్ని ప్రవేశపెట్టడం కూడా జీవవైవిధ్యాన్ని దెబ్బతీసింది. రిటైల్ వర్తకంలో విదేశీ ప్రత్యక్ష పెట్టుబడులు కూడా జీవ వైవిధ్యాన్ని దెబ్బతీస్తాయి. ఒక ప్రక్క కాంట్రాక్ట్ వ్యవసాయాన్ని ప్రోత్సహిస్తూ మరొక ప్రక్క భారీ ఎత్తున తమ సరుకుల్ని ఎగుమతి చేస్తూ విదేశీ బహుళజాతి కంపెనీలు మన వ్యవసాయంలో వున్న వైవిధ్యాన్ని దెబ్బకొట్టాయి. బహుళజాతి కంపెనీలు కార్పోరేట్ వ్యవసాయాన్ని ప్రోత్సహిస్తాయి. లాభాలు ఇచ్చే పంటల్నే ప్రోత్సహిస్తాయి. ఆహార ధాన్యాల ఉత్పత్తి తగ్గిపోతుంది. ఆహార పంటల రకాలు తగ్గుతాయి.

సామ్రాజ్యవాద దేశాలు మన దేశంలోని జీవ వైవిధ్యాన్ని, జన్యుసంపదను తరలించుకొని పోయాయి. దోపిడీ చేశాయి. వేలాది వరి రకాల్ని సేకరించి, ఫిలిప్పైన్స్‌లోని అంతర్జాతీయ వరి పరిశోధనా కేంద్రానికి తీసుకొని పోయారు. హైద్రాబాదులో వున్న ఇక్రిశాట్ సంస్థ ద్వారానూ, తదితర సంస్థల ద్వారానూ మన విత్తనాలను తీసుకొనిపోయి, కొద్దిగా వాటికి మార్పులు చేసి, వాటిని మనకే అంటగట్టి, కోట్లాది రూపాయలను బహుళజాతి కంపెనీలు సంపాదించుకుంటున్నాయి. మన రైతులు బహుళజాతి కంపెనీలపైన ఆధారపడటం పెరిగింది. మన రైతులు నష్టపోతున్నారు. మన జన్యు సంపద మనకు లేకుండా పోతోంది.

బహుళజాతి కంపెనీలు మన జీవరాశులపైన ఇతర జీవరాశులతో దాడికి పాల్పడుతున్నారు. పార్థీనియం (కాంగ్రెస్ గడ్డి, వయ్యారి భామ) అనే కలుపు మొక్కను అమెరికా, పిఎల్ 480 గోధుమల ద్వారా మన దేశంలోకి ప్రవేశపెట్టారు. కోటీ 20 లక్షల ఎకరాల్లో ఇది వ్యాపించింది. అనేక ప్రాంతీయ మొక్కల్ని అణగదొక్కింది. ప్రజల ఆరోగ్యానికి తీవ్ర విఘాతం కల్గిస్తోంది. ఈ విధంగా జీవ దాడి జరుగుతోంది.

సామ్రాజ్యవాద దేశాలు జీవ చౌర్యానికి (బయోపైరసీ) ఒడిగట్టుతున్నాయి. స్థానిక ప్రజల లేదా సమాజాల సాంప్రదాయ జ్ఞానాన్ని, వారి అంగీకారం లేకుండా, వారి ప్రయోజనాలకు విఘాతం కలిగించే విధంగా బహుళజాతి కంపెనీలు వాడుకోవడమే జీవ చౌర్యం. సాంప్రదాయ విజ్ఞాన సర్వస్వాన్ని తీసుకొంటుంది. కానీ, ఎవరి నుండి ఏమి తీసుకున్నా, వారికి ఏమీ ఇవ్వదు. 'హెస్ట్' అనే జర్మన్ కంపెనీ భారత్‌కు చెందిన 'మెంతి'ని, దానికి సంబంధించిన విజ్ఞానాన్ని తస్కరించి, ఔషధాన్ని తయారు చేసి, దానికి అమెరికన్ పేటేంట్ తీసుకొని కోట్లాది డాలర్లను సంపాదించుకుంటోంది. కానీ మనకు మాత్రం దక్కింది శూన్యం. అట్లాగే, తరతరాలుగా వస్తున్న, పసుపు, వేపకు చెందిన మన జ్ఞానాన్ని తీసుకొని, అమెరికా పేటెంట్ తీసుకుంది. భారత దేశం దీనికి వ్యతిరేకంగా పోరాడాల్సి వచ్చింది. మన బస్మతి బియ్యం పేరును టెక్సామతిగా పేరు మార్చి అమెరికా పేటెంట్ తీసుకుంది. మన దేశంలోనే లభించే ఒక రకం మొక్క నుండి 'గుగ్గిపిడ్' అనే మాత్రను తయారు చేసి, 60 మాత్రలను రూ. 1400/-కు ఒక అమెరికా కంపెనీ అమ్ముకుంటోంది. విదేశీ కంపెనీలు మోసాలు, కుట్రలు చేసి, మన విత్తనాలను కొట్టేసి, వాటిని వాడుకుని, కొద్దిగా మార్పులు చేసి, కొత్త పేర్లు పెట్టుకొని, పేటెంట్లు తీసుకుని, వాటిపై గుత్తాధిపత్యం సంపాదించి, వాటిని మన రైతులకే విక్రయించి, కోట్లాది రూపాయలను లూటీ చేస్తున్నాయి. పైగా, మన పైర్ల రకాలు కాల గర్భంలో కలసిపోతున్నాయి. మన రైతులకు దక్కకుండా పోతున్నాయి.

సామ్రాజ్యవాద శక్తులు జీవ కాలుష్యం కలిగిస్తూ, జన్యు సంపదను, జీవ వైవిధ్యాన్ని దెబ్బతీస్తున్నాయి. జన్యుమార్పిడి పంటల ద్వారా పర్యావరణంలోకి కొత్త జన్యుమార్పిడి జీవరాశుల్ని ప్రవేశపెట్టడం ద్వారా జన్యు కాలుష్యం పెరుగుతోంది. పర్యావరణం కాలుష్యమవుతోంది. విషపదార్థాలు వెదజల్లడం ద్వారా మేలు చేసే పక్షులు అంతరించిపోతున్నాయి. కొత్తగా భయంకరమైన కలుపు మొక్కలు, పురుగులు పుట్టుస్తున్నాయి.

జీవ వైవిధ్య విధ్వంసానికి **'జీవ వ్యాపారం'** ఒక ప్రధానమైన కారణం. ఈ వ్యాపారంలో ప్రభుత్వాలు కంపెనీలు ప్రధాన పాత్రధారులు. దేశాలు, కంపెనీలు, పరిశోధన-విద్యాసంస్థలు, వ్యక్తుల మధ్య లాభాల కోసం జీవన వనరులను కబలించడమే 'జీవ వ్యాపారం'. విదేశీ, స్వదేశీ కంపెనీలకు అనేక దేశాల ప్రభుత్వాలు ఇష్టంగానో, అయిష్టంగానో ఈ రంగంలో అనుమతిలిస్తున్నాయి. ఇది సాంప్రదాయ జ్ఞానాన్ని కలిగివున్న వ్యక్తుల లేదా సంస్థల ప్రయోజనాలను ప్రోత్సహించే విధంగా వుండడం లేదు. పెద్ద పెద్ద బహుళజాతి కంపెనీలతో బేర సారమాడే శక్తి సామర్థ్యాలు ఈ ప్రభుత్వాలకు వుండవు. ఒక కంపెనీ అనేక దేశాలతో ఒప్పందాలు చేసుకునే వీలుంది.

ఈ సందర్భంలో మన దేశానికి సంబంధించి ఒక ప్రమాదకరమైన ప్రతిపాదన గురించి తెల్సుకోవాలి. భారత వ్యవసాయ పరిశోధనా మండలిలో మొక్కల జన్యు వనరుల జాతీయసంస్థ (నేషనల్ బ్యూరో ఆఫ్ ప్లాంట్ జెనిటిక్ రిసోర్సెస్) వున్నది. ఈ సంస్థలో అనేక పంటలకు సంబంధించిన దాదాపు 5 లక్షల జన్యు కణాలను మైనస్ 120 డిగ్రీల శీతలంలో భద్రపరుస్తున్నారు. 800 సంవత్సరాల వరకు ఈ విధంగా జన్యు కణాలను భద్రపరచవచ్చు. ఈ అపురూపమైన, అత్యంత విలువైన, అపారమైన జన్యు కణాలను (జన్యు సంపదను) మోన్‌శాంటో లాంటి బహుళజాతి కంపెనీలు దోపిడీ చేయడానికి ప్రణాళికను సిద్ధం చేసుకున్నాయనీ, ఈ కంపెనీలకు జన్యుసంపదను కట్టపెట్టడానికి భారత వ్యవసాయ పరిశోధనామండలి సిద్ధంగావుందనీ, అమెరికాకే చెందిన 'వాల్‌స్ట్రీట్ జర్నల్' బయటపెట్టింది. విదేశీ కంపెనీలకు అమ్ముడుపోయినటువంటి, దేశభక్తి, మన రైతాంగంపట్ల లవలేశమైనా ప్రేమలేనటువంటి శాస్త్రజ్ఞులైన ఎన్‌బిపిజిఆర్ డైరెక్టర్, భారత వ్యవసాయ పరిశోధనా మండలి డిప్యూటీ డైరెక్టర్ (క్రాప్స్) కలసి అపరూపమైన మన జన్యు సంపదను విదేశీ కంపెనీలకు ధారాదత్తం చేయడానికి కుట్రలు చేస్తున్నారు. మన జన్యుకణాలను ఉపయోగించుకుని, నూతన విత్తనాలను తయారుచేసి మన రైతులకు తక్కువ ధరలకు విదేశీ కంపెనీలు అమ్ముతాయని ఈ శాస్త్రజ్ఞులు నమ్మబలుకుతున్నారు. ఎవరిని మోసం చేయాలనుకుంటున్నారు వీరు?! విదేశీ కంపెనీలు తక్కువ ధరకు మన రైతులకు విత్తనాలు అమ్ముతారంటే నమ్ముతామా? ఇప్పటికే, విత్తనాలకోసం విదేశీ కంపెనీలపైన ఆధారపడటం పెరిగిపోయింది. రైతాంగం విపరీతంగా నష్టపోయింది. మన విలువైన జన్యు సంపదను పోగొట్టుకొని, నూతన వంగడాలను రూపొందించే అవకాశం చేజార్చుకుని, రైతాంగాన్ని విత్తనాల కోసం విదేశీ కంపెనీల పైన ఆధారపడేట్లు చేసి, వారిని శాశ్వతంగా బానిసలుగా చేసే ప్రయత్నాన్ని నిర్ద్వంద్వంగా తిరస్కరించాలి.

సామ్రాజ్యవాద దేశాలు వ్యాపార వాణిజ్యాల ద్వారా పేద దేశాల్ని దోపిడీ చేయడానికి కుట్రలు చేస్తూనే వున్నాయి. ప్రపంచ వాణిజ్య సంస్థ (డబ్ల్యుటిఓ) ఏర్పాటు ఇందులో భాగమే. తమ వాణిజ్యాన్ని విస్తరించుకోడానికి సామ్రాజ్యవాద దేశాలు ఈ సంస్థను ఉపయోగించు కొంటున్నాయి. తమ ఎగుమతుల ద్వారా వర్థమాన దేశాల వ్యవసాయాన్ని తీవ్రంగా దెబ్బతీస్తున్నాయి. జీవ వైవిధ్య విధ్వంసానికి తెరతీశాయి.

అంతర్జాతీయ ఒప్పందాలు, చట్టాలను సామ్రాజ్యవాద దేశాలు తమకు అనుకూలంగా వాడుకుంటున్నాయి. వాణిజ్య సంబంధ మేధో సంపత్తి హక్కులు (టిఆర్ఐపిఎస్-ట్రిప్స్) జీవ వనరులను ప్రయివేట్ ఆస్థిగా పరిగణిస్తాయి. జన్యుకణాలు, మొక్కలు, సూక్ష్మ క్రిములు, పశువులు మొదలైన వాటిని ప్రభుత్వాలు, కంపెనీలు-సమాజాల అంగీకారం లేకుండా, ఏలాంటి అడ్డంకులు లేకుండా వ్యాపారం చేయొచ్చును. పేటెంట్లు తీసుకొని విత్తనాలు, తదితర ఉత్పాదకాలపైన పూర్తిగా కంట్రోల్ పొందవచ్చును. అంతర్జాతీయ ఒప్పందాల ద్వారా పేద దేశాల జీవ వనరులను లేదా జన్యు సంపదను సామ్రాజ్యవాద దేశాలు దోచుకుని, వాటి ద్వారా అపారమైన లాభాలను పొందుతున్నాయి.

బహుళజాతి కంపెనీలు వివిధ దేశాల్లోని ప్రభుత్వాల్ని, అధికారుల్ని శాస్త్రజ్ఞుల్ని వివిధ రీతుల్లో ప్రలోభపెట్టి, లంచాలు ఇచ్చి, అవినీతి మార్గాల ద్వారా వారిని లోబరుచుకుని తమ దోపిడీకి మార్గం సుగమం చేసుకుంటున్నాయి. సామ్రాజ్యవాద దేశాలు పేద దేశాల్ని బెదిరిస్తున్నాయి. యుద్ధాలు, ఆక్రమణలు చేసి పేద దేశాల్లోని ప్రకృతి వనరుల్ని దోపిడీ చేసి, జీవ వైవిధ్యాన్ని పర్యావరణాన్ని విధ్వంసం చేస్తున్నాయి.

ఇంతకు ముందే చెప్పినట్లు, దేశీయ పెట్టుబడిదారులు, కార్పోరేట్ కంపెనీలు, మాఫియా గ్యాంగులు, ప్రజా వ్యతిరేక, అవినీతి మయమైన ప్రభుత్వాలు సామ్రాజ్యవాద శక్తులకు వంతపాడుతూ, ప్రకృతి వనరుల్ని దోపిడీ చేస్తున్నారు. జీవ వైవిధ్యానికి విధ్వంసం కలిగిస్తున్నారు.

జీవ వైవిధ్యానికి అడవుల ఆవశ్యకత ఎంతయినా వుంది. పారిశ్రామిక తదితర రంగాలకు అవసరమైన కలప కోసం అడవులను నరికి వేయడం జరుగుతోంది. అపారమైన వృక్ష సంపద నశించింది. పశుపక్ష్యాదులకు తీవ్ర ఇబ్బంది కలుగుతోంది. వర్షాలు తగ్గుతున్నాయి. భూగర్భ జలాలు తరిగిపోతున్నాయి. భూమి నిస్సారమవుతోంది. విలువైన వనమూలికలు కనుమరుగవుతున్నాయి.

కొండలు, గుట్టలు తరిగిపోతున్నాయి. గ్రానైట్, తదితర ఖనిజాల కోసం తవ్వకాలు సాగిస్తున్నారు. గనుల తవ్వకం ఇటీవల కాలంలో ఊపందుకున్నది. గనుల మాఫియా గ్యాంగులు, రాజకీయ నాయకులు కలిసిపోయి ఏ అదుపూ, అడ్డంకీ లేకుండా గనుల తవ్వకం జరుపుతున్నారు. ఇనుము, బాక్సైట్ మైనింగ్ కొరకు లక్షలాది ఎకరాల భూమిని **(తరువాయి 6వ పేజీలో**

# అమెరికా సామ్రాజ్యవాదమా, వెనిజులాలో జోక్యం మానివెయ్యి!

**గుత్త** పెట్టుబడిదారీవర్గ ప్రయోజనాలకు అనుగుణంగా పనిచెయ్యనిరాకరించిన ప్రభుత్వాలను కూలద్రొయ్యటమూ, లేదా కూలద్రోసేందుకు అన్ని ప్రయత్నాలనూ సాగించటాలతో సామ్రాజ్యవాదుల చరిత్ర నిండిపోయింది. మూడవ ప్రపంచ దేశాలను అస్థిర పరచటమూ, జోక్యం చేసుకోవటమూ, సైనిక దురాక్రమణ తదితర రూపాలలో కార్మికవర్గంపై ప్రపంచ ప్రజలపై దాడులు సాగించి తన ఆర్థిక, రాజకీయ, సామాజిక, సైనిక, సైద్ధాంతిక ఆధిపత్యాన్ని నెలకొల్పుకుంటున్న చరిత్ర దానిది. కాంగో నాయకుడు లుముంబా, ఛిలీ అధ్యక్షుడు అలెండీ, ఇరాక్ అధినేత సద్దాం హుస్సేన్, లిబియా అధ్యక్షుడు గడ్డాఫీలను అది హత్య చేసింది. పశ్చిమ యూరపు సామ్రాజ్యవాదుల సహకారంతో వియత్నాం, కంబోడియా, లావోస్, ఆఫ్ఘనిస్తాన్, ఇరాక్, లిబియాలపై సైనిక దురాక్రమణ సాగించింది. ఇవి కొన్ని ఉదాహరణలు మాత్రమే. ఈనాడు అమెరికా సామ్రాజ్యవాదం వెనిజులా, ఇరాన్‌లలోని చట్టబద్ధ ప్రభుత్వాలను కూలద్రోసే దాడులను సాగిస్తున్నది.

గత దశాబ్దకాలంపైగా వెనిజులా అధ్యక్షుడు హ్యూగో ఛావెజ్‌ను పదవీచ్యుతుడిని చేసేందుకు అమెరికా సామ్రాజ్యవాదులు తీవ్ర ప్రయత్నాలు చేస్తూ వస్తున్నారు. 2012 అక్టోబరు మొదటి వారంలో జరిగిన అధ్యక్ష ఎన్నికల్లో ఛావెజ్ ఎన్నికయ్యాడు. కోటి 90 లక్షలమంది ఓటర్లలో 80 శాతం ఓట్లు వేయగా, వాటిలో 54.3 శాతం ఓట్లు (దాదాపుగా 75 లక్షలు) పొందిన ఛావెజ్ వరుసగా నాల్గవసారి అధ్యక్షుడిగా ఎన్నికయ్యాడు. ఛావెజ్ ఎన్నికకాకుండా చూసేందుకు అమెరికా సామ్రాజ్యవాదం ప్రతిపక్షాలకు నిధులందజేసింది. ఛావెజ్ అమలు చేస్తున్న సోషలిస్టు విధానాలు దేశాన్ని దారిద్ర్యంలో పడవేశాయని, సోషలిస్టు నినాదాలు వదులుకుంటేే తప్ప వెనిజులా ప్రజల కష్టాలు తీరవనీ ప్రచారం చేసింది. ఛావెజ్ ఓటమి తప్పదని గుత్తపెట్టుబడిదారీ పత్రికలు జోస్యం చెప్పాయి. ఎన్నికల ఫలితాలు వెలువడిన తర్వాత గత ఎన్నికల్లోకంటే ఛావెజ్ మెజారిటీ తగ్గిందని విశ్లేషణలు చేశాయి. ఛావెజ్‌పై పోటీ చేసిన కాప్‌రైల్స్ "గెలవాలంటే ఓడిపోవటం తెలియాలి. మనమొక మార్గం వేయగలిగాము. ఇక దాని మీద ప్రయాణిద్దాం. (తనకు పడిన ఓట్లు) 60 లక్షల మంది ఈ కొత్తమార్గాన్ని కోరుకుంటున్నారు అన్నాడు. ఎన్నికల ప్రచారంలో ఛావెజ్ తాను తిరిగి ఎన్నికయితే గతంలో చేసిన పొరపాట్లను సరిదిద్దుకుంటాననీ, దేశంలో చమురు నిల్వలను సంపదపునఃపంపిణీకి వినియోగిస్తాననీ, పెట్టుబడిదారీ వ్యవస్థకు సోషలిస్టు ప్రత్యామ్నాయాన్ని నిర్మిస్తాననీ క్యూబా, నికారాగువా వంటి సైద్ధాంతికంగా సన్నిహితంగా వుండే దేశాలకు బలం చేకూర్చుతాననీ వాగ్దానం చేశాడు. ఈ వాగ్దానాలు నెరవేర్చటంలో ఛావెజ్ ఎంతవరకూ సఫలీకృతుడౌతాడన్నది వేచి చూడాల్సివుంది.

ఎందుకంటే, ఛావెజ్ విజయంతో అమెరికా సామ్రాజ్యవాదం తన కుట్రలను, జిత్తులను మానుకోదు. కాప్‌రైల్స్ అన్నట్లు 60 లక్షల ఓట్లతో అది తన ప్రయత్నాలను తీవ్రపరుస్తుంది. వీటికి వ్యతిరేకంగా వెనిజులా ప్రజలను ఛావెజ్ ఎంతవరకూ రాజకీయంగా సంసిద్ధపరచే విధానాలు అమలు జరపగలడో చూడాల్సి వుంటుంది.

ప్రజలెదుర్కొంటున్న తక్షణ సమస్యలకు ఛావెజ్ పాలన కొంత ఉపశమనాన్నివ్వగలిగింది. ఉదాహరణకు వైద్య ఆరోగ్య, విద్యాసేవలను ఉచితంగా అందించాడు. 2008 తర్వాత చమురు రేట్లు బాగా పెరగటంతో చమురు అమ్మకాల నుండి వచ్చిన ఆదాయాన్ని దీని కొరకు వినియోగించగలిగాడు. అయినా దారిద్ర్యం తీరిపోలేదు. ఉపాధి కల్పన ఆశించినంతగా మెరుగు పడలేదు. ఇది ప్రజల్లో అసంతృప్తికి కారణంగావుంది. గతంకంటే మెజారిటీ తగ్గటం దీనినే సూచిస్తున్నది. దీనికి తగిన చర్యలు ఏ మేరకు తీసుకోగలడో చూడాలి.

ఛావెజ్ ఇప్పటికే కాన్సరు వ్యాధికి గురయ్యాడు. తగినంత చురుకుగా కదలలేడు గనుక తమ ఆటలు సాగించుకోగలమని వెనిజులా దళారీ బూర్జువాలూ, అమెరికా సామ్రాజ్యవాదమూ ఆశలు పెట్టుకున్నాయి. తన రాజకీయ సైద్ధాంతిక దార్శనికతను ఎంతవరకూ వ్యవస్థీకృత మొనర్చగలడన్న అంశంపై వెనిజులా భవిష్యత్తు ఆధారపడివుంటుంది.

ఈ పరిస్థితి అంచనా వేసేందుకు మరింత లోతైన పరిశీలన అవసరమౌతుంది. అమెరికా సామ్రాజ్యవాద మెందుకు ఛావెజ్‌ను ద్వేషిస్తున్నది? వెనిజులాలో ఛావెజ్ వర్గ పునాది ఏమిటి? ఆయన సోషలిస్టు విప్లవాన్ని సాగిస్తున్నాడా?

ఛావెజ్ మొదటి నుండీ అమెరికా సామ్రాజ్యవాద ఆధిపత్యాన్ని ప్రతిఘటిస్తూ వచ్చాడు. అమెరికా ప్రతిపాదించిన ఫ్రీట్రేడ్ అసోసియేషన్ అమెరికాస్ (అమెరికాఖండ స్వేచ్ఛావాణిజ్య మండలి)ని వ్యతిరేకించటమే కాక, దానిని వ్యతిరేకించమని లాటిన్ అమెరికా దేశాలకు పిలుపునిచ్చాడు. ప్రపంచబ్యాంకు, అంతర్జాతీయ ద్రవ్యనిధి అనుసరిస్తున్న విధానాలను విమర్శించాడు. ఆఫ్ఘనిస్తాన్, ఇరాక్‌లపై అమెరికా సామ్రాజ్యవాదుల దురాక్రమణను ఖండించాడు. లిబియా, క్యూబా వంటి దేశాలపై అమెరికా సామ్రాజ్యవాదులు విధిస్తున్న ఆంక్షలను తిరస్కరించటమే కాక వాటితో సంబంధాలు నెరపేందుకు పూనుకున్నాడు. అమెరికా గుత్త చమురు కంపెనీలు చమురు ధరను పెంచి వేయటాన్ని నిరసిస్తూ, మార్కెట్టు ధరకంటే తక్కువకు చమురు సరఫరా చేసేందుకు దీర్ఘకాలిక ఒప్పందాలు అనేక దేశాలతో చేసుకున్నాడు.

వెనిజులాలో అధికారంలోకి రాగానే అమెరికా గుత్తసంస్థల ఆధీనంలో వున్న చమురు పరిశ్రమను జాతీయం చేశాడు. వెనిజులాలో గత పాలకులనుసరించిన విధానాల ఫలితంగా వ్యవసాయరంగం కునారిల్లి పోయింది. 70 శాతం జనాభా రాజధాని కారకాస్‌కు చేరింది. ఛావెజ్ భూమి చట్టాన్ని చేసి భూమి పంపకానికి పూనుకున్నాడు. జనాభాను గ్రామాలకు తరలించేందుకు పూనుకున్నాడు. విద్యా, వైద్యరంగాలను ప్రభుత్వం చేపట్టి ఉచితంగా ప్రజలకందించేందుకు పూనుకున్నాడు. క్యూబా సహాయంతో వైద్యసేవలను పునరుద్ధరించాడు. స్వావలంబన కొరకు వైద్య కళాశాలలను, పరిశోధనా శాలలను ప్రారంభించాడు. దీనితో అమెరికా సామ్రాజ్యవాదుల ఆగ్రహానికి గురయ్యాడు. ఛావెజ్‌ను పదవి నుండి తొలగించే కుట్రలకు పూనుకుంది.

అమెరికా చమురు కంపెనీలు, చమురు పరిశ్రమలోని, తమ సాంకేతిక నిపుణులందరినీ వెనక్కు తీసుకుపోయాయి. దీనితో చమురు ఉత్పత్తి ఆగిపోయి, వెనిజులా ఆర్థిక సంక్షోభంలో పడుతుందని, ఛావెజ్ ప్రభుత్వం కూలిపోతుందనీ వారు ఆశించారు. కానీ వెనిజులా కార్మికులు చమురు పరిశ్రమను ప్రతిభా వంతంగా నడపగలిగారు. అమెరికా గుత్తకంపెనీలకు సేవచేస్తున్న, ప్రాభవం కోల్పోయిన వెనిజులా దళారీ బడాబూర్జువా వర్గాన్ని ఆసరా చేసుకుని సార్వత్రిక సమ్మెల పిలుపులతో దేశ జీవనాన్ని స్థంభింప చేసేందుకు పూనుకున్నారు. ప్రజల మద్దతుతో ఛావెజ్ దీనిని త్రిప్పి కొట్టాడు. దీనితో సైనిక తిరుగుబాటు చేయించారు. కానీ సైన్యంలోని దేశభక్తిగల సెక్షను ఛావెజ్‌కు బాసటగా నిలిచింది.

వెనిజులా రాజ్యాంగ చట్టం ప్రకారం అధ్యక్షపదవికి రెండవసారి పోటీ చేయరాదు. దీనితో ఛావెజ్ పదవీ కాలం ముగిసే వరకూ అమెరికా వేచి వుంది. అయితే ఛావెజ్ తాను మళ్లీ పోటీ చేసేందుకు వీలుగా రాజ్యాంగాన్ని సవరించి ప్రజల తీర్పును (రిఫరెండంను) కోరి విజయం పొందాడు.

వెనిజులాపై అమెరికా సామ్రాజ్యవాద ఆధిపత్యాన్ని ఛావెజ్ ప్రతిఘటించాడన్నది నిర్వివాదం. ఆ మేరకు వెనిజులా ప్రజలలో సామ్రాజ్యవాద వ్యతిరేక చైతన్యాన్ని పెంచాడు. ప్రజా మద్దతుతో అమెరికా సామ్రాజ్యవాదాన్ని ఎదిర్చి నిలిచాడు.

అయితే ఛావెజ్, వెనిజులా కార్మికవర్గ ప్రతినిధి కాదు అన్న వాస్తవాన్ని కూడా మనం గుర్తించాలి. వెనిజులా బూర్జువా వర్గంలోని ఒక సెక్షన్‌కు ఆయన ప్రతినిధి. బూర్జువా వర్గంలోని ఈ సెక్షను సామ్రాజ్యవాదం చేత, బడా దళారీ బూర్జువావర్గం చేత నిరంతరం అణచివేయబడుతున్నది. సామ్రాజ్యవాదంతో మిలాఖత్తు అయిన వెనిజులా బడా బూర్జువావర్గం సామ్రాజ్యవాదుల ప్రయోజనాలకు సేవచేస్తూ దక్కిన దానితో తృప్తిపడు తున్నది. ఈ దారిదోపిడీతో వెనిజులా కుంగిపోయి ఆర్థిక సంక్షోభంతో బూర్జువావర్గంలోని ఒక సెక్షను దివాళా అవుతున్నది. ఇది తన మనుగడ కోసం సామ్రాజ్యవాద వ్యతిరేక జాతీయ విధానాలను చేపట్టింది. దీనికి ప్రతినిధిగా ఛావెజ్ ముందుకు వచ్చాడు.

కనుకనే ఛావెజ్ వెనిజులాపై సామ్రాజ్యవాద ఆధిపత్యాన్ని వ్యతిరేకించాడు; దేశ ఆర్థిక జీవనాడులను బిగించి పట్టుకున్న బడాదళారీ బూర్జువా వర్గాన్ని వ్యతిరేకించాడు. ఆ మేరకు తన విధానాలను రూపొందించి అమలు జరిపాడు. సైద్ధాంతికంగా పెట్టుబడిదారీ వ్యవస్థను వ్యతిరేకించాడు. సోషలిస్టు ప్రత్యామ్నాయాన్ని నిర్మిస్తానన్నాడు కానీ రాజకీయంగా గుత్తబ్యాంకుల ప్రయోజనాలను కాపాడే చర్యలను తీసుకున్నాడు. కొన్ని పారిశ్రామిక రంగాలను ప్రైవేటీకరించాడు. ఇది పెట్టుబడిదారీ విధానాన్ని బలపరిచేవే తప్ప సోషలిస్టు సమాజ నిర్మాణానికి దోహదపడేవికావు. ఛావెజ్ రాజకీయాలలోని వైరుధ్యమిది.

ఈ వైరుధ్యమే నేడు వెనిజులా సమాజంలో ప్రతిబింబిస్తున్నది. ఈనాడు వెనిజులాలో సామ్రాజ్య వాదుల, దళారీ బూర్జువాల ఆర్థిక, రాజకీయ కార్యకలాపాలు సాగుతున్నాయి. వీరు ఛావెజ్ ప్రభుత్వం తొలగిపోవాలని కోరుకుంటున్నారు. మరో ప్రక్కన గుత్తాధిపత్యాన్ని వ్యతిరేకిస్తున్న బూర్జువా వర్గమున్నది. ఇది ఛావెజ్ పాలన కొనసాగాలని కోరుకుంటున్నది. ఈ రెంటికన్నా ప్రధానంగా విశాల జనబాహుళ్యం వున్నారు. వీరు సామ్రాజ్యవాద దోపిడీ ఆధిపత్యాలు పోవాలని కోరుకుంటున్నారు. దోపిడీపీడన లేని సోషలిస్టు సమాజం నిర్మాణం కావాలని కోరుకుంటున్నారు. ఈ వెనిజులా ప్రజలు ఛావెజ్‌కు మద్దతుగా వున్నారు. ఆయనను సమర్థిస్తూ వీధులలోకొచ్చి అభివృద్ధి నిరోధక శక్తులను ఎదుర్కొంటున్నారు.

రాజకీయాల్లోని ఈ వైరుధ్యం ఫలితంగా, సంక్షోభం తీవ్రమౌతున్నది. ఆకలి, దారిద్ర్యం పెరుగుతున్నాయి. నిరుద్యోగం, అవినీతి కొనసాగుతున్నాయి. సంక్షోభం తీవ్రంగా ఉన్నప్పటికీ సామాజిక దుష్ప్రభావం అంత తీవ్రంగా లేకపోవటానికి చమురు ఎగుమతుల నుండి వస్తున్న ఆదాయం ఒక కారణం. ఇది ప్రజలకు కొంత ఉపశమనాన్నివ్వగల అవకాశాన్ని ఛావెజ్‌కిచ్చింది. కాగా, అమెరికా ఈ సంక్షోభాన్నే ఛావెజ్ వ్యతిరేక ప్రచారం సాగించటానికి వాడుకుంటున్నది.

అమెరికా సామ్రాజ్యవాదానికి ప్రతిఘటన, స్వతంత్రత అన్న ఛావెజ్ చేపట్టిన రాజకీయ విధానాలు వెనిజులాలోనూ, అంతర్జాతీయ స్థాయిలోనూ సామ్రాజ్యవాద వ్యతిరేక ఉద్యమం బలీయమవటానికీ, తద్వారా విప్లవోద్యమం ఒకడుగు ముందుకు వేయటానికీ తోడ్పడుతుంది. సామ్రాజ్యవాదాన్ని ప్రతిఘటించే చర్యలు తీసుకుంటున్న మేరకు మనం ఛావెజ్‌కు సంఘీభావం తెలుపుతాము. సామ్రాజ్యవాదం మన శతృవు. దానిని వ్యతిరేకించటం మన కర్తవ్యం.

అదేసమయంలో కార్మికవర్గ విప్లవోద్యమానికి ఛావెజ్ మార్గదర్శికాజాలడు. సామ్రాజ్యవాద వ్యతిరేక ఉద్యమంలో ఆయన పాత్రను గుర్తించి ఆయనకు బాసటగా నిలుస్తాము. అయితే కార్మికవర్గాన్ని విప్లవానికి సన్నద్ధపరిచి సోషలిస్టు సమాజస్థాపనకు మన కార్మిక వర్గ పంథాను అమలు జరిపే కృషిని కొనసాగిస్తాము.

ఛావెజ్ మార్గమే మనకనుసరణీయమని వాదిస్తున్నవారు వెనిజులా సమాజంలో వర్గాల పొందికను, వర్గ వ్యత్యాసాలనూ చూడనిరాకరిస్తున్నారు. ప్రైవేటు ఆస్థి హక్కు పునాదిగా వుండే పెట్టుబడిదారీ విధానపు బలాన్ని చూడ తిరస్కరిస్తున్నారు. అంతర్జాతీయంగా సకల అభివృద్ధినిరోధక శక్తులకూ నాయకుడిగా రూపొందిన సామ్రాజ్యవాదాన్ని, ప్రత్యేకించి అమెరికా సామ్రాజ్యవాద బలాన్ని, దాని ఆర్థిక చొరబాటు, సైనిక జోక్యం, దురాక్రమాణలను వ్యూహాత్మకంగా కూడా తక్కువగా అంచనా వేస్తున్నారు.

పార్లమెంటరీ పంథా ద్వారా అధికారంలోకి వచ్చి సోషలిజాన్ని నిర్మించగలమన్నది పేరాశ మాత్రమేనని చరిత్ర పదేపదే నిరూపించింది. ఆ భ్రమలో పడిపోకుండా వర్గపోరాటాన్ని తీవ్ర పరచటమే మన కర్తవ్యం. ✡

---

## వ్యవసాయ... (చివరి పేజీ తరువాయి)

దాని కోసం అనుసరించాల్సిన ప్రజాపంథాను ముందుంచింది. భారత సమాజమార్పు సమస్య అంటే భూమిసమస్యే. తెలంగాణా రైతాంగ సాయుధ పోరాటంతో భీతిల్లిన పాలకులు భూ సంస్కరణల చట్టాలు చేశారు. అలా చేయమని సూచించింది అమెరికా సామ్రాజ్యవాదులే. నెహ్రూ సైనిక చర్యతో రైతాంగ పోరాటాన్ని అణచివేశాడు. మరోవైపున అమెరికా పంపిన నిపుణులను ప్రణాళికా సంఘ సలహాదారులుగా నియమించి వారి సూచనల మేరకు భూగరిష్ట పరిమితి చట్టాలు చేశాడు. అవి భూస్వామ్య విధానాన్ని రద్దు చేసేందుకుద్దేశించినవి కావు. పోరాడుతున్న రైతాంగాన్ని భ్రమలపాలు చేసేందుకు చేసినవనీ అందుకనే భూస్వామ్య విధానం రద్దు కాలేదనీ అన్నారు.

తర్వాత పైరు పచ్చ విప్లవమన్నారు. దీనిని ఆదర్శమని కీర్తించిన పంజాబు రాష్ట్రంలోని ఖార్ గ్రామం నేటి స్థితి ఏమిటి? ఇటీవల అక్కడికి వెళ్లితే గ్రామం బయట "గ్రామం అమ్మబడుతుంది" అని బోర్డు పెట్టివుంది. ఇప్పుడిక కార్పొరేటు సాగు అంటున్నారు. పదేళ్ల తర్వాత దాని ప్రక్కన మరో బోర్డువస్తుంది. "ఈ గ్రామ జనాభా అమ్మకానికుంది" అని!

కనుకనే, సామ్రాజ్యవాద కబంధ హస్తాలనుండి బయటపడటానికీ, భూస్వామ్య వ్యవస్థను రద్దు చేయటానికీ భారత కార్మిక వర్గం పూనుకోవాలని అన్నారు. కా॥ టి.ఎన్. 'తాకట్టులో భారతదేశం' ద్వారా ప్రజాపంథాను రూపొందించి, విప్లవానికి కార్యాచరణ ప్రణాళికను అందించారన్నారు. అతివాద, మిత వాదాలకు వ్యతిరేకంగా సిద్ధాంత, రాజకీయం పోరాటం సాగించిన టి.ఎన్. బాటలోనే మనం సాగాలన్నారు.

ట్రస్టు సభ్యులు **కా॥ ఆడారి అప్పారావు** మాట్లాడుతూ గత 36 సంవత్సరాలుగా సాగిన పరిణామాలు కా॥ టి.ఎన్. విశ్లేషణ సరైనదనీ, ఆయన చూపిన బాటే ఆచరణశీలమని నిర్ధారించాయన్నారు. ప్రజలు పోరాట మార్గాన్నెంచుకోకుండా మౌలిక సంస్కరణలు తానే చేస్తానంటూ, ప్రజలను భ్రమల్లో పడవేసిన ప్రభుత్వం ఈనాడు ప్రజాకర్షక పథకాలతో కొంత ఉపశమనం కలిగించే పేరిట ప్రజలను పోరాడకుండా నిలువరించే విధానాన్ని పాటిస్తున్నా యన్నారు. ఈ భ్రమలకు లోనుగాకుండా విప్లవ కార్యాచరణకు ప్రజలను సన్నద్ధులను చేయాలన్నారు.

ఏఐఎఫ్‌టియు (న్యూ) రాష్ట్ర సహాయ కార్యదర్శి **కా॥ గణేష్‌పాండా** మాట్లాడుతూ భారత కార్మికవర్గం ఎదుర్కొంటున్న సమస్యలను వివరించారు. కార్మిక వర్గం తాను విముక్తి చెందటానికి మిగిలిన వర్గాల విముక్తిని సాధించాలన్న రాజకీయ చైతన్యాన్ని పెంచేందుకు కమ్యూనిస్టు పార్టీ పూనుకోవాలనీ, త్యాగనిరతితో వర్గరాజకీయాలతో కార్మికవర్గాన్ని సంసిద్ధం చేయాలనీ, పార్లమెంటరీ భ్రమలనూ, అతివాద ఒంటెత్తుపోకడనూ తిరస్కరించాలన్నారు. ఈ ఆవశ్యకతను కా॥ టి.ఎన్. తన గ్రంథంలో వివరించారన్నారు.

రైతుకూలీ సంఘం (ఆం.ప్ర.) రాష్ట్ర అధ్యక్షులు **కా॥ సింహాద్రి ఝాన్సి** మాట్లాడుతూ కా॥ టి.ఎన్.కు విప్లవ జోహార్లు తెలిపారు. టి.ఎన్. అందించిన అవగాహనతో నేటి పరిస్థితులను విశ్లేషించి ప్రజల రాజకీయ చైతన్యాన్ని పెంచాలన్నారు. రైతాంగం, వ్యవసాయకూలీలు, ఆదివాసులూ ఎదుర్కొంటున్న సమస్యలను పేర్కొని భూస్వాములు, బడాబూర్జువాలు, సామ్రాజ్యవాదులు వీటిమూల కారణమని సోదాహరణంగా వివరించారు. తాము సృష్టించిన సమస్యలకు తామే తప్పుడు పరిష్కారాలు చూపిస్తూ పాలకులు ప్రజలను గందరగోళ పరుస్తున్న తీరును పంట విరామ నినాదం అనుభవాలను తీసుకుని లోతుగా వివరించారు. ఉత్తరాంధ్రలో కార్మికులకు కనీస వేతనాలు కూడా చెల్లించని స్థితిని, విద్యుత్తు సంక్షోభంలో చిన్న పరిశ్రమలు, వ్యాపారాలు కృంగిపోతున్న దుస్థితినీ వివరించారు.

ప్రజల ఏ సమస్యలనూ పట్టించుకోకుండా, పాలక పార్టీల్లోని ముఠాలు తగువులు పడుతున్నాయనీ, అవినీతిలో కూరుకుపోయి ప్రజాధనాన్ని దిగమింగుతూ త్వంశుంఠస్థాయిలో ఆరోపణలు చేసుకుంటున్నారనీ అన్నారు. ఉదాహరణకు వాన్‌పిక్ భూముల్లో ఏరువాకంటూ మంత్రులే బయలు దేరారుగానీ అక్రమంగా కాజేసిన భూములను తిరిగి రైతాంగానికే అప్పజెబుతామనడానికి మాత్రం వారికి నోరు రావటంలేదు. అవినీతితో ప్రజలకు జరుగుతున్న నష్టం వారికి పట్టలేదు. ప్రజాధనాన్ని దిగమింగటంలో వాటాలకోసమే తగవులాడుకుంటున్నారన్నారు.

ఈ స్థితిలో సంవత్సరాల తరబడి నిరాహార దీక్షలు, నిరసనలు సాగించినా సమస్యలు పరిష్కారం కావనీ, సంఘటిత పోరాటాలకు పునుకోవాలనీ అన్నారు. కా॥ టి.ఎన్. చూపిన బాటలో దళితులను, గిరిజనులనూ, రైతాంగాన్ని, కార్మికులను సంఘటిత పరిచేందుకూ, పోరాటాలు సాగించేందుకూ పూనుకోవాలన్నారు. సాయంత్రం నాలుగు గంటలకు ముగిసిన సెమినార్‌లో ఉత్తరాంధ్ర జిల్లాలనుండి కార్మికులు, ఆదివాసులు, రైతులు, విద్యార్థులు, ఉపాధ్యాయులు, మేధావులు పాల్గొన్నారు. సెమినార్ ఉపన్యాసాలను ఆకళింపు చేసుకునేందుకు శ్రద్ధగా విన్నారు. ✡

# పాలకవర్గాలు సృష్టించి, ఆరకుండా రగిలిస్తున్న కాశ్మీరు సమస్య

**ఒక** సమస్యపై ఏదేని ఒక ఆందోళన, నిరసనలతో తీవ్రస్థాయిలో ఎదురైనప్పుడు కమిటీలను నియమించడమనేది భారత పాలకులకు వెన్నతోపెట్టిన విద్య. ఇలా నియమించిన కమిటీ లేదా కమీషన్ల అనుభవాలన్నింటినీ పరిశీలించితే, అత్యధిక సందర్భాలలో సమస్యను దాట వేసేందుకో, కాలాన్ని దొర్లించుకు వెళ్ళేందుకో లేదా కంటితుడుపు చర్యలతో ప్రజలను జోకొట్టేందుకో మాత్రమే-ఇవి తోడ్పడుతున్నాయని స్పష్టమౌతోంది. 2010 ఆగస్టు-సెప్టెంబరు మధ్యకాలంలో కాశ్మీరీ ప్రజలు భారత ప్రభుత్వానికి వ్యతిరేకంగా మిలిటెంట్ నిరసనాందోళనలు నిర్మించారనే విషయం మనందరికీ తెలుసు. ఈ ఉద్యమాన్ని అణచివేసేందుకు సాయుధ పోలీసుబలగాలు కాల్పులు సాగించి 100 మందికి పైగా యువతీ యువకులను హత్యగావించటమే గాకుండా, మరెంతో మందిని జైళ్ళలో నిర్బంధించారు. అయినా, నిరసనోద్యమం చల్లారలేదు. అఖిలపక్ష పార్లమెంటు సభ్యుల బృందం కాశ్మీరును సందర్శించి ప్రజలను శాంతింపజేసే ప్రయత్నం చేశారు. కానీ, తమను మోసంచేసే మరొక ప్రయత్నంగా ప్రజలు దీనిని భావించారు. ప్రజలు స్వచ్ఛందంగా, పెద్దఎత్తున పాల్గొంటున్న ఈ ఉద్యమాన్ని 'కుట్రపూరితంగా భారత వ్యతిరేక శక్తులు సాగిస్తున్న దానిగా' కొట్టిపారేయటానికి భారత ప్రభుత్వానికి సాధ్యంకాలేదు. ఈ పరిస్థితులు -భారత ప్రభుత్వం ముగ్గురు సభ్యుల మధ్యవర్తుల బృందాన్ని నియమించేందుకు నేపథ్యంగా ఉన్నాయి. ప్రఖ్యాత జర్నలిస్టు దిలీప్ పడ్గోంకర్; విద్యావేత్త రాధాకుమార్; మరియు మాజీ సమాచార కమీషనర్ ఎం.ఎం. అన్సారీ లు సభ్యులుగా, దిలీప్ పడ్గోంకర్ ఆధ్వర్యంలో జమ్ముకాశ్మీర్ ప్రజల, రాజకీయశక్తుల భావాలు, ఆలోచనలన్నింటినీ కూలంకుషంగా పరిశీలించి నివేదికను సమర్పించేందుకు ఉద్దేశించి ఈ బృందాన్ని నియమించారు. కేంద్ర హోంశాఖామంత్రికి 2011 అక్టోబర్ 12న ఈ బృందం తన నివేదికను సమర్పించింది. కాగా, 2012 మే 24 దాకా, హోం మంత్రిత్వశాఖ ఈ నివేదికను ప్రజలకు వెల్లడి చేయలేదు. అప్పటికి కూడా, ఈ నివేదికపై ప్రభుత్వం తన మనోగతాన్ని వెల్లడిచేయలేదు.

## మధ్యవర్తిత్వ బృందసభ్యుల నివేదికలో చేసిన ముఖ్యమైన సిఫార్సులివి :

1. మాటల్లో, చేతల్లో 370వ అధికరణం ప్రకారం కాశ్మీర్ 'ప్రతేక ప్రతిపత్తి'ని పునరుద్ధాటించాలి. భారత పార్లమెంటుకు, జమ్ము-కాశ్మీర్ అసెంబ్లీకి మధ్యవర్తిత్వ బృంద నివేదికను సమర్పించిన ఆరు నెలలలోగా ఒక రాజ్యాంగబద్ధ కమిటీని ఏర్పరచాలి. 1952 కాశ్మీర్ ఒప్పందం తర్వాత జమ్ముకాశ్మీర్ రాష్ట్రానికి వర్తింపజేసిన కేంద్ర ప్రభుత్వ చట్టాలు, భారతరాజ్యాంగ అధికారణాలు కాశ్మీర్ ఒప్పంద సవరణతోగానీ, సవరణ లేకుండా గానీ-జమ్ముకాశ్మీర్ ప్రత్యేక ప్రతిపత్తికి ఏ మేరకు భంగకరంగా పరిణమించాయో సమీక్షించేందుకు; రాష్ట్రప్రభుత్వ అధికారాలను క్రోడీకరించేందుకు ఈ రాజ్యాంగ బద్ధ కమిటీకి అధికారం కల్పించాలి. ఈ కమిటీ సిఫార్సులను 370వ అధికరణం ప్రకారం తన అధికారాన్ని ఉపయోగించి రాష్ట్రపతి ఇందులో చేర్చాలి.

2. ప్రజారక్షణ చట్టం సవరణ; కల్లోలిత ప్రాంత చట్టం మరియు సాయుధబలగాల ప్రత్యేకాధికార చట్టాన్ని తిరిగి మదింపు చేయటం వంటి చర్యల ద్వారా కోల్పోయిన నమ్మకాన్ని తిరిగి పునరుద్ధరించేందుకు చొరవజేయాలి.

3. భారత ప్రభుత్వ అంతరంగిక భద్రతకు మరియు ఇతర దేశాల నుండి భద్రతకు సంబంధించని అంశాల్లో -ముఖ్యంగా కీలకమైన ఆ రాష్ట్ర ఆర్థిక ప్రయోజనాలు మరీ ముఖ్యంగా విద్యుత్తు, నీటివనరులకు సంబంధించిన అంశాల్లో -కాశ్మీరుకు వర్తించే ఏ విధమైన చట్టాలనూ పార్లమెంటూ చేయబోదని గట్టిహామీనివ్వాలి.

4. స్వయం ప్రతిపత్తి మరియు చట్టబద్ధ సంస్థల అధికారాన్ని కాశ్మీరుకు విస్తరింపజేయాలి; వీటి పనితీరు జమ్ముకాశ్మీర్ రాష్ట్ర రాజ్యాంగ అంశాలకు అనుగుణంగా వుండాలి.

5. ప్రభుత్వ విధానంలో భాగంగా కాశ్మీరీలందరనూ-ప్రధానంగా పండిట్లందరనూ వెనకకు తిరిగి రప్పించటం; వాస్తవాధీనరేఖ వెంబడి నివసిస్తున్న కాశ్మీరీలను తిరిగి రప్పించే ప్రక్రియను సులభతరం చేయటం; గుర్తుతెలియని సమాధుల అంశాన్ని పరిశీలించేందుకు ఒక న్యాయవిచారణ కమిషన్‌ను ఏర్పరచటం; మానవహక్కుల, చట్టబద్ధ పాలన సంస్కరణలను వేగవంతం చేయటం... వంటి కాశ్మీర్ ప్రజల నమ్మకాన్ని పెంపొందించేందుకు ఉద్దేశించిన ప్రధానమంత్రి కార్యాచరణ బృంద సిఫార్సులను త్వరితంగా అమలుచేయాలి. జమ్ముకు, కాశ్మీర్‌కు మరియు లడఖ్‌లకు-మూడు విడివిడి ప్రాంతీయ కౌన్సిళ్ళను ఏర్పరచాలి.

6. సాధ్యమైనంత త్వరగా హురియత్ కాన్ఫరెన్స్‌తో చర్చల క్రమాన్ని ప్రారంభించాలి. పాకిస్తాన్ మరియు పాక్ ఆధీనంలో జమ్ముకాశ్మీర్‌లు రాజ్యాంగ బద్ధకమిటి చేసిన సిఫార్సులపైనా, భారత ప్రభుత్వానికి -హురియత్‌కు మధ్య చర్చలలో ముందుకొచ్చిన అంశాలపైనా తప్పనిసరిగా సంభాషణలు జరిపేవిధంగా ప్రోత్సహించాలి. వాస్తవాధీన రేఖకు ఇరువైపులనున్న ప్రజలమధ్య పౌరసమాజ సంబంధాలను ప్రోత్సహించేదిగా భారత-పాకిస్తాన్‌ల మధ్య ఒప్పందాన్ని స్వాగతించాలి.

7. కాశ్మీరు సమస్య పరిష్కారానికి వెతుకులాటను భారత-పాకిస్తానుల మధ్య చర్చలమేరకే పరిమితం చేయరాదు. జమ్ముకాశ్మీర్‌లోని స్టేక్‌హోల్డర్స్ ఒక పరిష్కారాన్ని కనుగొనాలనుకునేట్లయితే అందులో చేరేందుకు పాకిస్తాన్‌కు అన్నివేళలా ద్వారాలు తెరిచి వుంచాలి.

8. గవర్నర్ నియామకానికి రాష్ట్ర అసెంబ్లీ మూడు పేర్లను రాష్ట్రపతికి సమర్పిస్తుంది. 356వ అధికరణంక్రింద ప్రభుత్వం రద్దుచేయబడినప్పుడు, 3 నెలలలోగా ఎన్నికలు తప్పనిసరిగా నిర్వహించాలి.

9. కాశ్మీరీల స్వావలంబనను పెంపొందించేందుకు కేంద్ర-రాష్ట్రాల నడుమ ఒక నూతన ఆర్థిక ఒప్పందం జరగాలి.

10. ప్రధానస్రవంతిలో భాగంగా లేని వారితోసహా సంబంధితులందరితోనూ సంభాషణలు జరపటంద్వారా ఒక రాజకీయ పరిష్కారం సాధ్యమని ప్రజలందరి సాధారణ అభిప్రాయంగా వుంది.

మధ్యవర్తిత్వ బృంద సభ్యులు, కాశ్మీర్ సమస్య పరిష్కారానికి తమ బృందం ఏ విధమైన పరిష్కారాన్నీ సూచించటంలేదని తమకు తాముగా స్పష్టంచేశారు. 'గడిచిన కాలాన్ని తిరిగి వెనుక్కు తీసుకురాలేమనే'ది మధ్యవర్తిత్వ బృంద సభ్యుల దృక్పథంగా వుంది. కనుక వారి సిఫార్సుల పరిమితిని అర్థంచేసుకోవటం కష్టమేమీ కాదు. అదే సమయంలో, మధ్యవర్తిత్వ బృంద సభ్యులు కాశ్మీర్‌లో తమ విస్తృత పర్యటనద్వారా, ప్రజలతో విస్తృత సంభాషణలద్వారా, గత ఆరు దశాబ్దాలుగా భారత ప్రభుత్వం తన వివిధ విధానాలు, ఆచరణలతో కాశ్మీర్ ప్రజల నమ్మకాన్ని పూర్తిగా కోల్పోయిందని పేర్కొంటూ, అది కాశ్మీర్ ప్రజలనుండి పూర్తిగా పరాయీకరింపబడిందని వారి సిఫార్సులలో స్పష్టంచేశారు. కాశ్మీర్ ప్రజల నడుమ విశ్వాసాన్ని పునరుద్ధరించేందుకు కొన్ని ఖచ్చితమైన, నిర్దుష్టమైన చర్యల అవసరాన్ని కూడా ఈ సిఫార్సులు సూచించాయి. ఈ చర్యలు ఏమంటే-370వ అధికరణం అమలును నీరుగార్చే, ఉల్లంఘించే అన్ని అంశాలను చక్కదిద్దుకొని మాటల్లోనూ, చేతల్లోనూ దానిని సక్రమంగా పునరుద్ధరించాలి; కాశ్మీర్‌లో నిర్బంధ విధానాలకు ముగింపు పలకటంతోపాటు నిర్బంధం కారణంగా బాధితులైనవారికి న్యాయంచేయాలి; చిరకాలంగా కొనసాగుతున్న కాశ్మీర్ సమస్య పరిష్కారానికిగానూ స్వేచ్ఛగా, విశాలదృష్టితో సంభాషణల క్రమానికి చొరవజేయాలి.

కేంద్రప్రభుత్వ హోంమంత్రిత్వశాఖ తనవద్దకు చేరిన ఈ నివేదికను వెల్లడిచేయటానికే 8 నెలల కాలం తీసుకుంది. ఈ నివేదికను అధ్యయనం చేసి దీనిపై చర్యలు తీసుకునేందుకు ప్రభుత్వానికి ఈ సమయం సరిపోతుంది. కానీ, ప్రభుత్వం ఈ నివేదికపై ఒక నిర్ణయం తీసుకునే ముందుగా, దీనిపై విస్తృత చర్చ జరగాలని కోరుకుంటున్నట్లుగా విజ్ఞప్తి చేయటాన్ని బట్టి ప్రభుత్వం తన మనోగతాన్ని వెల్లడిచేయకుండా కాలయాపనజేసి దాటవేయటానికే పూనుకొందని స్పష్టమౌతోంది.

'కొన్ని మౌలిక వాస్తవాలను నిరాకరిస్తూ రూపొందించిన వాచాలత్వపు' నివేదికగా దీనిని బిజెపి అభివర్ణించింది. 'ఉగ్రవాద వ్యతిరేక చర్యలను నీరు గార్చే సూచనలు చేయడం మినహా, ఉగ్రవాద సమస్యకు ఏ విధమైన పరిష్కారాన్ని సూచించటంలో విఫలమైంద'ని కూడా బిజెపి పేర్కొంది. "పాక్ ఆక్రమిత కాశ్మీర్ (పిఓకె) భారతదేశంలో అంతర్భాగంగా పేర్కొంటూ 1994లో పార్లమెంటు చేసిన తీర్మానానికి భిన్నంగా-'పాకిస్థాన్ పాలిత జమ్ముఅండ్ కాశ్మీర్ ప్రాంతం'-గా నేడు గుర్తించటం ద్వారా ఈ నివేదిక మనదేశస్థితిని మరింత బలహీనపర్చింద'నికూడా బిజెపి పేర్కొంది. చివరగా, "370వ అధికరణాన్ని గుర్తించటమనేది జమ్మూకాశ్మీర్‌కు -మిగతా దేశానికి నడుమ మానసిక అవరోధంగా వుంది. ఈ అధికరణాన్ని రద్దు చేయాలని ప్రతిపాదించటం గాకుండా, దీనిని శాశ్వతమొనర్చాలని నివేదిక సిఫార్సు చేసింద'ంటూ బిజెపి సూటిగా తన అంతరంగాన్ని బయటపెట్టుకుంది.

చారిత్రకంగా, కాశ్మీరు ప్రజల జాతీయ, ప్రజాస్వామిక హక్కులను, వాంఛలను భారత, పాకిస్థాను పాలకవర్గాలు క్రూరంగా నిరాకరిస్తూ, అణచివేస్తూ వస్తున్న ఫలితమే కాశ్మీరు సమస్య! భారత రాజ్యాంగంలో 370వ అధికరణం జొప్పించటంద్వారా కాశ్మీరుకు ప్రత్యేక ప్రతిపత్తిని కల్పిస్తామని భారత పాలకులు నమ్మబలికారు. కాశ్మీరు ప్రజల ఆకాంక్షల కనుగుణంగా కాశ్మీరు సమస్య అంతిమ పరిష్కార దిశగా ఒక నిజాయితీతో కూడిన ముందడుగుగా ఈ చర్యను భారత పాలకులు పరిగణించలేదు. ఈ కాలమంతటా కాశ్మీరీ ప్రజల ప్రయాణం-చిత్రహింసలు, అవమానాలు, నిరాశా నిస్పృహతోనే సాగుతోంది. ఒకవైపున, భారత పాలకులు నిరంతరాయంగా 370వ అధికరణాన్ని కుదిస్తూ, దానిని నీరుగారుస్తూ ఆచరణలో దానినో ఖాళీ కాగితంగా మార్చివేశారు. మరోవైపున, కాశ్మీరీ ప్రజల న్యాయమైన హక్కులను, పోరాటాలను, డిమాండ్లను క్రూరంగా అణచివేస్తూ వస్తున్నారు. ప్రత్యేకాధికారాలతో సాయుధమైన బలగాలతో కాశ్మీరును నింపి వేయటంతోపాటుగా కాశ్మీర్‌లోని అనేక ప్రాంతాలలో నిర్బంధ చట్టాలతో నిరంకుశ పాలనను అమలు చేస్తున్నారు. కాశ్మీరుపై తమ పట్టు సడలిపోకుండా వుండేందుకుగానూ భారత పాలకులు ఆ రాష్ట్రంలో ప్రభుత్వాలను ఏర్పరిచే ఎన్నికల ప్రక్రియను ఒక ఆటగా మార్చివేశారు. సామ్రాజ్యవాదులు-ప్రత్యేకించి అమెరికా సామ్రాజ్యవాదులు ఇరుదేశాల ప్రజలను శాశ్వతంగా విభజించి వుంచేందుకు, తద్వారా లబ్ధిపొందేందుకు, ఇరుదేశాలపై తన పట్టును బిగించేందుకు భారత-పాకిస్తాను దేశాలమధ్య రగిల్చి, కొనసాగిస్తున్న నిరంతరాయ వైరాల నడుమ కాశ్మీరు ప్రజలు అత్యధికంగా బాధలకు గురౌతూ వస్తోన్నారు. కొద్ది బృందాలుగా వున్న జీహాదీలు లేక పాక్ ప్రేరేపిత ఉగ్రవాదులు యావత్తు కాశ్మీరు ప్రజల నిజాయితీగల వాంఛలను, పోరాటాలను అపఖ్యాతిపాలు చేయటంలో తమ పాత్రను పోషిస్తున్నాయి. కాశ్మీరు ప్రజల జాతీయ, ప్రజాస్వామిక హక్కులను, వాంఛలను అపఖ్యాతిపాలు చేసేందుకు, తిరస్కరించేందుకు వారి ప్రతి చర్యనూ భారత పాలకులు ఉపయోగించుకోవటంతోపాటుగా దానిని సాకుగా చూపెట్టి నిర్బంధాన్ని తీవ్రంజేస్తున్నారు.

కాశ్మీరు ప్రజల జాతీయ, ప్రజాస్వామిక హక్కులను, వాంఛలను నిరాకరించటంలో, అణచివేయటంలో భారత దేశంలోని పాలకవర్గ పార్టీలన్నీ ఐక్యంగా వున్నాయి. 370వ అధికరణాన్ని తొలగించకుండానే దానిని నామమాత్ర అవశిష్టంగా మార్చివేయటానికి చేసిన విధాన నిర్ణయాలు, చర్యలన్నింటికీ అత్యధిక కాలం పాలనాధికారంలోనున్న కాంగ్రెస్‌పార్టీ ప్రత్యక్షంగా బాధ్యత వహించవలసివుండగా బిజెపి మరియు దాని సంఘ్‌పరివార్ పక్షాలన్నీ ఈ విధానాలకు, చర్యలకు తమ మద్దతునూ, సహకారాన్నీ అందించుకుంటూ వస్తూనే కాశ్మీరుకు ప్రత్యేక ప్రతిపత్తి అనే దానిని పేరుకు కూడా లేకుండా పూర్తిగా తొలగించాలనే తమ ప్రచారాన్ని కొనసాగించుకుంటూ; కాశ్మీరు ప్రజల పోరాటాలను అపఖ్యాతి పాలుజేసే ప్రయత్నాలు సాగిస్తూ; జాతీయ దురహంకారాన్ని, ఉన్మాదాన్ని ప్రేరేపించి మత ప్రాతిపదికపై ప్రజలను విభజించేందుకు ప్రయత్నిస్తున్నాయి.

కాశ్మీరు ప్రజలు భారతప్రభుత్వం పట్ల విశ్వాసాన్ని కోల్పోయేందుకు, వారి పరాయీకరణ మరింతగా పెరిగేందుకు ఈ విధానాలు, చర్యలన్నీ కారణంగా వున్నాయి. ఈ విధానాలకు, చర్యలకు వ్యతిరేకంగా ప్రజలు తమ అసంతృప్తిని, ఆగ్రహాన్ని, నిరసనను వివిధ రూపాల్లో వ్యక్తంచేస్తూ వస్తూన్నారు. కొన్ని సందర్భాలలో ప్రజల నిరసన తక్కువ స్థాయిలో నుంటే, మరి కొన్ని సందర్భాలలో అది ప్రజల తిరుగుబాటుగా బ్రద్దలవుతున్నది. ప్రజలకు ఓదార్పు కలిగించే పేరిట కొన్ని పథకాలతో భారత పాలకులు ముందుకొస్తున్నారు. కాశ్మీర్ సమస్య మూలాన్ని విడిచిపెట్టి, ప్రజలకు విశ్వాసం పెంపొందించే మరి ఏవో చర్యలను వారు ఆశ్రయిస్తున్నారు. 2010 అక్టోబరులో భారత ప్రభుత్వం ఏర్పరిచిన మధ్యవర్తిత్వ బృందపు ఏర్పాటు కూడా ఈ కోవలోనిదే!

దీర్ఘకాలంగా కొనసాగుతున్న కాశ్మీర్ సమస్య పరిష్కారానికి-కాశ్మీరు ప్రజల జాతీయ, ప్రజాస్వామిక హక్కులు, వాంఛలను మొదట గుర్తించాలి. రెండవది-యావత్తు కాశ్మీరు ప్రజలు నిర్భయంగా, స్వేచ్ఛగా తమ భవితవ్యాన్ని నిర్ణయించుకోవటానికి ప్రజాస్వామిక, శాంతియుత పరిస్థితులను, వాతావరణాన్ని కల్పించాలి. ఇవిగాక, ఈ సమస్యను పరిష్కరించేందుకు మరే పద్ధతిలో ప్రయత్నించినా, ప్రజల ఆకాంక్షలకు భిన్నంగా వారిపై ఒక పరిష్కారాన్ని రుద్దినా, అవన్నీ సమస్యను మరింత సంక్లిష్టం చేయటంతోపాటుగా, మరింత తీవ్రం చేస్తాయి.

370వ అధికరణాన్ని మాటల్లోనూ, చేతల్లోనూ పునరుద్ధరించేందుకు తక్షణ, నిర్ణయాత్మక చర్యలతోపాటుగా మధ్యవర్తిత్వ బృందం సిఫార్సు చేసిన విధంగా కాశ్మీరులో శాంతియుత, ప్రజాస్వామిక పరిస్థితులు, వాతావరణం నెలకొల్పేందుకు పూనుకోవటంవంటి తక్షిణ చర్యలద్వారా మాత్రమే కాశ్మీర్ భవితవ్యంపై ప్రజలు తమ ఆకాంక్షలను స్వేచ్ఛగా వ్యక్తీకరించటానికి మార్గం సుగమమవటానికి అవకాశం వుంది. ఈ సమస్యను దాటవేయటానికి భారత ప్రభుత్వం చేపట్టే ఏ చర్య అయినా, జాతీయ దురహంకారుల కనుగుణంగా నృత్యం చేసేందుకు చేసే ఏ ప్రయత్నమైనా కాశ్మీరు ప్రజానీకంనుండి అది తనకు తానుగా మరింత దూరం చేసుకోవటానికే దోహదపడుతుంది. ✡

---

## పెట్టుబడిదారీ... (4వ పేజీ తరువాయి)

ప్రభుత్వం కేటాయించింది. అక్రమ మైనింగ్ విస్తారంగా జరుగుతోంది. బొగ్గును ఓపెన్ కాస్టింగ్ ద్వారా తవ్వుతున్నారు. గనుల తవ్వకంవల్ల అడవులు, కొండలు అంతరించిపోతున్నాయి. వ్యవసాయ భూముల్ని రైతులు కోల్పోతున్నారు. తమ ఆవాసాలనుండి ప్రజలు, ముఖ్యంగా ఆదివాసీలు గెంటివేయబడుతున్నారు. నిర్వాసితులు అయి, అనాధలవుతున్నారు.

వ్యవసాయేతర పనులకోసం ప్రభుత్వం, పెట్టుబడిదారులు భూసేకరణకు, భూ కబ్జాలకు భారీఎత్తున పాల్పడుతున్నారు. సెజ్‌లు, పరిశ్రమలు, సీపోర్టులు, ఎయిర్‌పోర్టులు, 4-6-8 లైన్ల రోడ్లు, మొదలైన వాటికోసం భూముల్ని రైతులనుండి లాక్కొంటున్నారు. వాన్‌పిక్, గంగవరం, కృష్ణపట్నం పోర్టులు, కాకినాడ సెజ్, కోస్టల్ కారిడార్ మొదలైన వాటికోసం భూమిని లాక్కొంటున్నారు. బయ్యారం గనులకోసం ఒకటిన్నర లక్షల ఎకరాల భూమిని, బ్రాహ్మణి స్టీల్ ఫ్యాక్టరీకొరకు 14,000 ఎకరాల భూమిని, మరెన్నో అభివృద్ధి ప్రాజెక్టులకోసమంటూ వేలాది ఎకరాల భూమిని రాష్ట్రప్రభుత్వం తమ అనుకూల వర్గాల వారికి కేటాయించింది. కోస్టల్ కారిడార్‌తో అడవులు నాశనమవుతాయి. సముద్ర సంపద కలుషితమవుతుంది. మత్స్య సంపద అంతరిస్తుంది. ధర్మల్, అణువిద్యుత్ ప్రాజెక్టులు-అడవుల్ని, పర్యావరణాన్ని, వ్యవసాయాన్ని, ప్రజల ఆరోగ్యాన్ని, జీవితాల్ని ఛిన్నాభిన్నం చేస్తాయి. పారిశ్రామీకరణ పేరుతో పర్యావరణాన్ని విధ్వంసం చేయడం జరుగుతోంది. వేగంగా విస్తరిస్తున్న పట్టణీకరణ కూడా పర్యావరణాన్ని, జీవవైవిధ్యాన్ని దెబ్బతీస్తోంది. పట్టణాల్లోనూ, పరిసర ప్రాంతాల్లోనూ చెట్లు, చెరువులు అంతరించాయి.

ప్రకృతి వనరుల వినియోగంలో సమతుల్యత లోపించడంవల్ల వాతావరణంలో మార్పులొస్తున్నాయి. విపరీత ఎండలు, చలిగాలులు, అకాల వర్షాలు సంభవించి జీవవైవిధ్యాన్ని విధ్వంసం చేస్తాయి. అనేక కారణాలవల్ల, స్వార్థపూరిత పెట్టుబడిదారులు, సామ్రాజ్యవాద శక్తులచేత జీవవైవిధ్య విధ్వంసం జరుగుతోంది. సామ్రాజ్యవాద దేశాలు జీవ వైవిధ్యాన్ని దోపిడీ చేయకుండా అరికట్టాలి. జీవ వైవిధ్య విధ్వంసానికి కారణమవుతున్న సెజ్‌లు, కోస్టల్ కారిడార్, ఓపెన్ కాస్ట్ మైనింగ్, గనుల తవ్వకం, అడవుల నరికివేత, ధర్మల్, అణువిద్యుత్ ప్రాజెక్టులు, రసాయనిక వ్యవసాయం, జన్యుమార్పిడి పంటలు, దేశీయ, విదేశీ కంపెనీలకి ప్రకృతి వనరులను దోచిపెట్టటం వంటి పెట్టుబడిదారి వ్యవస్థ యొక్క, సామ్రాజ్యవాదం యొక్క దుర్మార్గ పథకాలకు, కుట్రలకు వ్యతిరేకంగా ప్రజలందరూ ఐక్యంగా ఉద్యమించాల్సిన అవసరం వుంది. జీవ వైవిధ్యం, పర్యావరణం, ప్రకృతి వనరులు ప్రజల మనుగడకు, అభివృద్ధికి తోడ్పడాలి. ఈ లక్ష్య సాధనకోసం ఐక్య ప్రజా ఉద్యమాలే శరణ్యం.

అంతర్జాతీయ సదస్సులు ఈ లక్ష్యసాధనకు ఏమాత్రం తోడ్పడలేవు. ఇప్పటికే 10 సదస్సులు జరిగాయి. కొన్ని తీర్మానాలు చేశాయి. ఒక్కటి కూడా అమలు కాలేదు. సామ్రాజ్యవాద దేశాలు అనుకూలంగా లేనందువల్ల భవిష్యత్తులో కూడా అమలు కావు. ఈ సదస్సులవల్ల ప్రజలకు ఒరిగిందేమీలేదు. భవిష్యత్‌లో ఏవో ప్రయోజనాలు ఒనగూరుతాయనే ఆశాలేదు. అందువల్ల, ప్రజలే జీవవైవిధ్య రక్షణకు, దాని సుస్థిర వాడుకకూ నడుం బిగించాలి. దానికి అవసరమైన చట్టాల్ని ప్రభుత్వంపై ఒత్తిడి తెచ్చి చేయించాలి. అవి ఖచ్చితంగా అమలు జరిగేట్లు చూడాల్సిన బాధ్యత కూడా ప్రజలదే. ✡

# హైదరాబాద్ ప్రభుత్వ ఆసుపత్రులపై 'హెల్త్‌వాచ్' అధ్యయన నివేదిక

**హైదరాబాద్‌లోని** ప్రముఖ డాక్టర్లు, ఇతర నిపుణులతో కూడిన బృందం ఒక హెల్త్‌వాచ్ సంస్థగా ఏర్పడ్డారు. ఇందులో డా॥ ఎస్. పురేంద్ర ప్రసాద్, డా॥ రామచంద్రయ్య, డా॥ క్రిష్ణారెడ్డి, డా॥ రాజారెడ్డి, ప్రొ॥ కె.ఆర్. చౌదరి, ఎమ్. లక్ష్మి సభ్యులుగా వున్నారు. ఈ కమిటీ సభ్యులు ప్రభుత్వ బోధనాసుపత్రులు, ప్రత్యేక ఆసుపత్రుల పరిస్థితులు, డాక్టర్ల సమస్యలపై అధ్యయనానికి హైదరాబాదులోని కొన్ని ప్రముఖ ఆసుపత్రులను సందర్శించారు. ముందస్తు అనుమతితో, హైదరాబాదులోని గాంధీ, ఉస్మానియా, నీలోఫర్ అను మూడు ప్రముఖ ఆసుపత్రుల సూపరింటిండెంట్లు, డాక్టర్లు, ఇతర సహాయక సిబ్బందిని కలసి ఒక నివేదికను తయారు చేశారు. అందులోని ముఖ్యాంశాలు ఈ విధంగా ఉన్నాయి.

వెళ్ళిపోతారు. వీరితో పాటు కనీసం 100కు పైగా రోగులు వైద్యం కోసం చేరుతారు. ఇంత మందిని పరీక్షించడానికి సరిపడా వైద్య సిబ్బంది అందుబాటులోలేరు.

**5.** ఉస్మానియా ఆసుపత్రిలో రోజూ 100కు పైగా న్యూరోసర్జరీ కేసులు వస్తుంటాయి. హైదరాబాదులోని మిగతా ఆసుపత్రులన్నిటిలో కలిపి కూడా ఇన్ని కేసులు వుండవు.

**6.** చిన్నపిల్లల ప్రత్యేక ఆసుపత్రి "నీలోఫర్"కు ఎక్కువగా తక్కువ బరువుతో పుట్టిన పిల్లలు, అన్ని అవయవాలు పూర్తిగా సమకూరని శిశువులను తీసుకొస్తారు. కొందరు అయితే ప్రైవేటు ఆసుపత్రులన్నిటిలో చూపించి, ప్రమాదకర స్థాయి దాటిన తరువాత చివరగా

న్యాయంగా ఆరోగ్య సమస్యలపై వీరు బాధ్యత వహిస్తున్నప్పటికి, ఆర్థికంగా గాని, పదోన్నతులలో గానీ ఎటువంటి ప్రోత్సాహం లేదు. పనిచేయని క్రిందిస్థాయి ఉద్యోగులపై గట్టి చర్యలు తీసుకోవడానికి వీరికి అధికారాలు వుండవు. అందువలన రోజువారి ఆసుపత్రుల నిర్వహణ కష్టతరమైపోతున్నది.

**10. జీవనధార**

ప్రైవేటు ఫార్మా కంపెనీలు "బ్రాండెడ్ డ్రగ్స్" పేరిట 20 నుండి 300 శాతం అధిక ధరలకు మందులను విక్రయిస్తున్నాయి. అయితే **'జీవనధార'** పథకం ద్వారా ప్రభుత్వం తక్కువ ధరలకే మందులను అందజేస్తున్నది. వీటిని

| క్రమ సంఖ్య | వనరులు | ఉస్మానియా ఆసుపత్రి | గాంధీ ఆసుపత్రి | నీలోఫర్ ఆసుపత్రి |
|---|---|---|---|---|
| 1. | పడకలు | మంజూరైనవి-1300. రోజూ రోగుల సంఖ్య-2000 | మంజూరైనవి-1050. రోజూ రోగుల సంఖ్య-1900 | మంజూరైనవి-500. రోగుల చేరిక-1200 నియోనాటాలజి-20; 200 మంది చేరిక |
| 2. | సిబ్బంది | 100 మంది డాక్టర్లు, 200 మంది నర్సులు, 300-4వ తరగతి సిబ్బంది, 50- సాంకేతిక సిబ్బంది అవసరం వున్నారు | 100 మంది డాక్టర్లు, 400 మంది నర్సులు 100 మంది సాంకేతిక సిబ్బంది 10 మంది అనెస్థీషియన్స్ అవసరం వున్నారు | డాక్టర్లు, నర్సులు నాల్గో తరగతి సిబ్బంది చాలాతక్కువ సంఖ్యలోవున్నారు |
| 3. | పరికరాలు | 1-సి.టి. స్కానర్, 1-పారా మీటర్ ఎమర్జెన్సీలో ఒక్క వెంటిలేటర్ కూడా లేదు. సిటి స్కానర్ లేదు. 30 మంది క్షతగాత్రులు చనిపోయారు | ఎమర్జెన్సీ వార్డులోని 9 వెంటి లేటర్లలో కేవలం 4 పని చేస్తున్నాయి సి.టి., ఎంఆర్ఐ స్కానర్లు ఎలక్ట్రొలైట్స్ ఆర్టరీ బ్లడ్‌గ్యాసు ఎనాలిసిస్ పరికరాలు లేవు | 20 వెంటిలేటర్లలో నాలుగే పనిచేస్తున్నాయి వీటితోనే 120 మందికి సేవలు అందించాలి. ఆక్సిజన్, సల్ఫక్టేంట్ కేఫ్ డైట్ ఇంజక్షన్ల కొరతవుంది. |
| 4. | రోగ నిర్ధారక పరిక్షాపరికరాలు | ల్యాబ్ సదుపాయాలు లేక రోగులను ప్రైవేటు కేంద్రాలకు పంపుతున్నారు | ల్యాబ్ సదుపాయాలు లేక పరీక్షలకోసం ఆరోగ్యశ్రీ రోగులనుకూడ ప్రైవేటు కేంద్రాలకు పంపుతున్నారు | ప్రస్తుత లేబొరేటరీ సౌకర్యాలు అంతంత మాత్రమే |
| 5. | నిధులరాక | ఆసుపత్రి సూపరింటెండెంటుకు రు. 10 వేల కొనుగోళ్ళకు మాత్రమే ఆమోదం తెలిపే అధికారం వుంది. ఎపిహెచ్ఎంఐడిసి నుంచి ఎప్పుడోగాని విడుదల కావు. | ఎపిహెచ్ఎంఐడిసి, వైద్యుల మధ్య పరస్పర అవగాహన లేమితో ఆరోగ్య సేవలపై వ్యయం సరిపడా లేదు. | ఎపిహెచ్ఎంఐడిసి ఆసుపత్రి పరిస్థితులను సరిగా అర్థం చేసుకోలేక పోతోంది |
| 6. | కనీస సదుపాయాలు | ఇన్ పేషంట్ భవనాన్ని ఆధునీకరించాలి. ఒకటే లిఫ్టు పనిచేస్తుంది. 3 లిఫ్టులు అవసరం. నీటి పైపులు, మురికినీటి పైపులను మార్చవలసివుంది | త్రాగునీరు, అత్యవసర గదులు కొరత వుంది | త్రాగునీరు, అత్యవసర గదులు కొరత వుంది. ఉద్యోగస్తులకు, రోగులకు సరిపడక ఇబ్బంది పడుతున్నారు. |
| 7. | సాంకేతిక సిబ్బంది | గత కొన్ని సం॥లుగా సాంకేతిక సహాయ సిబ్బందిని నియమించలేదు. కాంట్రాక్టు సేవలతో ఆసుపత్రి నిర్వహణ కష్టంగా వున్నది | గత కొన్ని సం॥లుగా సాంకేతిక సహాయ సిబ్బందిని నియమించలేదు. కాంట్రాక్టు సేవలతో ఆసుపత్రి నిర్వహణ కష్టంగా వున్నది | సాంకేతిక నిపుణులను అత్యవసరంగా నియమించవలసిన అవసరం వుంది. |
| 8. | భద్రత | ఎక్కువ సంఖ్యలో అత్యవసర కేసులు రావడం వలన అందరికీ భద్రత కల్పించవలసిన అవసరం వుంది | | |

**1.** కార్పొరేట్ స్థాయి వైద్యం అందిస్తున్న ఈ మూడు ప్రభుత్వ ప్రత్యేక ఆసుపత్రులు గతంలో కంటే 100-200 అధిక శాతం రోగులకు వైద్యం అందిస్తున్నాయి.

**2.** తగినంత స్థాయిలో సిబ్బందిగాని, పరికరాలు గాని, మందులుగాని, ల్యాబ్ సదుపాయాలుగాని, రోగనిర్ధారణ పరీక్షలు చేసేందుకు సరిపడా సాంకేతిక సిబ్బందిగాని, కనీస వసతులుగాని, భద్రతగాని, ఆర్థిక సహాయంగాని లేకుండానే వైద్య సేవలు అందిస్తున్నాయి అంటే ఎవరికైనా ఆశ్చర్యం కలగక మానదు. అధ్యయనంలో తేలిన వాస్తవాలు పట్టిక రూపంలో గమనించండి.

**3. క్లిష్టతరమైన ప్రమాదకర జబ్బులు**

రాష్ట్రంలోని పేద ప్రజలే కాకుండా, మహారాష్ట్ర, కర్ణాటక, ఒరిస్సా ప్రాంత ప్రజల అవసరాలను కూడా ఈ ప్రత్యేక ఆసుపత్రులే తీరుస్తున్నాయి. మండల, జిల్లా స్థాయిలో ప్రాథమిక వైద్యం కూడా సరిగా అందక పోవడంతో, ఈ ప్రభుత్వ ప్రత్యేక ఆసుపత్రులే అన్ని రకాల రోగులతో పాటు, ప్రమాదకర జబ్బులను అప్పుడప్పుడు చూడవలసిన స్థితి. నర్సింగ్‌హోమ్‌లు, ప్రైవేటు ఆసుపత్రులు, కార్పొరేటు ఆసుపత్రులు రోగుల నుంచి అందినంతమేర పిండుకొని, సాంకేతికంగా, ఆర్థికంగా లాభదాయకం కాని కేసులను ప్రభుత్వ ఆసుపత్రులకే పంపివేస్తున్నాయి. దీనితో ప్రభుత్వ ఆసుపత్రులు "డంప్‌యార్డ్"లుగా మారుతున్నాయి.

**4. దిక్కూ మొక్కూ లేని కేసులు**

తీవ్ర గాయాలైన ఆర్థోపెడిక్ కేసులు రోజూ 8-10 వరకు గాంధీ ఆసుపత్రికి వస్తున్నాయి. వీటికి సంబంధించిన వివరాలు ఏమీ తెలియవు. ప్రమాదకర పరిస్థితులలో వున్న వీరిని కొందరు సానుభూతి పరులు "గాంధీ"లో చేర్పించి

ఇందులో చేరుస్తారు. వీరు ప్రైవేటు ఆసుపత్రుల చుట్టూ తిరగడానికి సమయం అయిపోగా, ఇక్కడికి వచ్చిన తరువాత ఏమైనా జరిగితే 'నీలోఫర్" నే నిందిస్తున్నారు. తల్లిపిల్లలను తొందరగా, జాగ్రత్తగా తీసుకురావడం కూడ ఒక సమస్యగావుంది.

**7.** ప్రమాదకర జబ్బులున్న వారినే (ఉదా॥ కామెర్లు, మెదడువాపు వ్యాధి, ఊపిరితిత్తుల వాపు మొ॥వి) నీలోఫర్ ఆసుపత్రిలో చేరుస్తారు. ఇక్కడ మందుల కొరత తీవ్రంగా ఉన్నది. ఉదా॥ రు. 8000 విలువ చేసే "సల్ఫక్టేంట్" ఇంజక్షన్లు, రు. 2000 విలువ చేసే ''ఇన్యోగ్లోబిన్స్'' మందులు అందుబాటులో లేవు. ఇంత ఖర్చుతో కూడుకున్న మందులను పేద ప్రజలు ఎలా కొనగలరు? ప్రి-మెచ్యూర్ శిశువులకోసం ప్రత్యేక వార్డు లేకపోవడంతో వారిని ఇతర పిల్లలతో పాటు ఉంచి చికిత్స చేస్తున్నారు. దీనితో "అంటురోగాలు" ఒకరి నుండి మరొకరికి త్వరగా వ్యాప్తి చెందడానికి అవకాశాలు ఉన్నాయి. ఇందువలనే ఎక్కువ మంది పిల్లలు చనిపోతున్నారు. ఇక్కడ ప్రత్యేక వార్డు అత్యవసరం.

**8. ప్రైవేటు సేవలు**

ప్రతి ఆసుపత్రిలోనూ 'కాంట్రాక్టు' పద్ధతిలో ఉద్యోగులను, సిబ్బందిని నియమించడంతో వారిలో బాధ్యత కొరవడి సేవాతనం లోపించింది. చివరకు పారిశుధ్య విభాగంలోనూ ఇలా చేయడంతో పరిశుభ్రత చర్చించ లేనంత క్షీణ దశకు చేరుకుంది. కాంట్రాక్టు సేవలపై అన్ని స్థాయిల్లోనూ తీవ్ర వ్యతిరేకత వున్నది.

**9.** సూపరింటిండెంట్, డిఎంఇ, ప్రిన్సిపాల్ మొ॥ ముఖ్యమైన స్థాయిల్లో కూడ "ఇన్‌చార్జ్" లకే బాధ్యతలు అప్పగిస్తున్నారు. సాంకేతికంగా

మరింత విస్తృత పరచి అందరికీ అందుబాటులో ఉంచితే మరింత ఉపయోగకరంగా ఉంటుంది.

**జూనియర్ డాక్టర్ల సమస్యలు**

**గ్రామీణ సేవలు :**

దీనిపై ప్రభుత్వానికే సరియైన అవగాహన లేదనిపిస్తుంది. ప్రభుత్వం ఏదైనా ఒక విధాన నిర్ణయాన్ని అమలు పరిచేటప్పుడు వాటికి సంబంధించిన నిపుణులతో చర్చించి నిర్ణయం తీసుకుంటే బాగుండేది. గ్రామీణ సేవలపై ఖచ్చితమైన విధివిధానాలు లేకపోవడంతో వైద్య విద్యార్థుల నుంచి తీవ్ర వ్యతిరేకత వ్యక్తమవుతున్నది.

- గ్రంథాలయాలలో పి.జి. విద్యార్థులకు, డాక్టర్లకు సరిపడా పుస్తకాలు, పత్రికలు అందుబాటులో లేవు.
- పి.జి విద్యార్థులకు సక్రమంగా జీతాలు ఇవ్వడంలేదు. 6-8 నెలలకు ఒకసారి ఆందోళనలు, ధర్నాలు చేసినప్పుడే అంద జేస్తున్నారు.
- పరిశోధనలకు ప్రోత్సాహం కరువైంది. అన్ని ఆసుపత్రులలో కార్పోరేట్ స్థాయి నిర్వహణలేదు.
- నిర్ణీత కాలవ్యవధిలో నియామకాలు, పదోన్నతులు కల్పించడంలో ప్రభుత్వం విఫలమవుతున్నది. చాలామంది డాక్టర్లు పదోన్నతులు లేకుండానే పదవీ విరమణ పొందుతున్నారు.
- అత్యవసర సేవలకు అవసరమైన పరికరాలు, మందులు, సదుపాయాలు అతితక్కువగా ఉన్నాయి.
- ప్రైవేటు మెడికల్ కాలేజీలు, డిగ్రీ మరియు పోస్ట్ గ్రాడ్యుయేట్ కోర్సులకు అనుమతులను సులభంగా పొందుతున్నాయి. కానీ ప్రభుత్వ మెడికల్ కాలేజీలకు అంత ప్రాధాన్యత పొందలేకపోతున్నాయి. పెద్దమొత్తంలో డబ్బు చెల్లించి ప్రైవేటు కాలేజీలో చేరిన విద్యార్థులు, "ఇంటర్న్‌షిప్" కు మాత్రం "గాంధీ" లేక ఉస్మానియా ఆసుపత్రులలోనే చేరుతున్నారు. ఇంత ఎక్కువ మంది "హౌస్ సర్జన్ల" కు మెడికల్ కౌన్సిల్ ఎలా అనుమతిఇస్తుందో తెలియడంలేదు.
- పి.జి. మరియు యు.జి. ప్రవేశ పరీక్షల్లో పారదర్శకత లేదు. కౌన్సిలింగ్ నిర్వహణలో కూడా లోపాలు వున్నాయి. ఎన్‌టిఆర్ హెల్త్ యూనివర్సిటి అవినీతికి నిలయం అని విమర్శలు ఉన్నాయి.
- ఏ ఆసుపత్రిలో కూడ 24 గంటల ప్రయోగశాల సౌకర్యం లేదు.
- రెసిడెన్షియల్ విధానం కోసం 2001 సం॥ నుండి విద్యార్థులు పోరాడుతూనే ఉన్నారు.
- ఇంజనీరింగ్ కోర్సులవలె, సరియైన ఆసుపత్రి సదుపాయాలు, విద్యావిధానం లేని ప్రైవేటు మెడికల్ కాలేజీలకు అనుమతులు ఇవ్వడం వలన వైద్య విద్యలో కూడ నాణ్యత లోపిస్తున్నది. రాష్ట్రంలోని 30 ప్రైవేటు మెడికల్ కాలేజీల్లో 200-250 పి.జి. సీట్లు ఉన్నాయి. ఒకొక్క సీటు 1-2 కోట్ల వరకు ధర పలుకుతున్నది. ఇంత డబ్బు ఖర్చుపెట్టి చదివిన విద్యార్థులు కార్పొరేట్ ఆసుపత్రులలో చేరకుండా పేదలకు వైద్యం అందిస్తారా?

**వైద్య సేవలను మెరుగు పరుచుకోవడానికి ఏమి చేయాలి?**

అత్యవసరంగా నివారణ చర్యలు చేపట్టకపోతే ప్రభుత్వ వైద్య విధానాన్ని కాపాడుకోలేము. ఏ ఒక్కరి ప్రాణాన్ని పణంగా పెట్టలేము.

1. పరికరాలు, మందులు, మౌలిక వసతుల కల్పన, సౌకర్యాలు పెంచాలి.
2. జవాబుదారితనం, పారదర్శకత ఖచ్చితంగా అమలు చేయాలి. అన్ని విభాగాల్లో అవినీతిని అరికట్టాలి.
3. డాక్టర్లు మరియు ఇతర సహాయక సిబ్బంది నియామకం, పదోన్నతులు కల్పించడం మొ॥వి నిర్ణీత కాల వ్యవధుల్లో అమలు చేయాలి.
4. పరిశోధనలను ప్రోత్సహించాలి. గ్రంథాలయాలు మరియు ఇతర సదుపాయాలను అభివృద్ధి పరచాలి.
5. వైద్య విద్య అభివృద్ధి మరియు గ్రామీణ సేవలపై ఖచ్చితమైన జాతీయ విధానాన్ని అమలు పరచాలి.
6. స్టైఫండు చెల్లింపులు, పరిసరాల నిర్వహణ, బోధనా పద్ధతులను ఆధునీకరించాలి.
7. ప్రైవేటు మెడికల్ కాలేజీలలో ప్రమాణాలు తక్కువగా ఉన్నవి. ప్రైవేటు ఆసుపత్రులలో అనైతిక వ్యవహారాలు అదుపు లేకుండా వున్నవి, కఠినమైన రెగ్యులేటరీ విధానాన్ని అమలు పరచి, ప్రైవేటు ఆసుపత్రులను నియంత్రించాలి. ★




రిటైల్ రంగంలో తోడేళ్ళ మంద

(వ్యాససంకలనం)

సిపిఐ (ఎం-ఎల్) ప్రచురణ

వెల: 12/-

కాపీలకు :

మైత్రి బుక్ హౌస్

28-9-1, జలీల్ వీధి, కారల్‌మార్క్స్ రోడ్, విజయవాడ-2

# 'వ్యవసాయ విప్లవాన్ని అగ్రభాగన్నుంచండి'

## టి.ఎన్. మెమోరియల్ ట్రస్టు సెమినార్‌లో ప్రొ॥ గోలక్ బీహారీనాథ్ అభిభాషణ


సెమినార్‌కు హాజరైన ప్రతినిధులు


ప్రొ॥ గోలక్‌బీహారీనాథ్


కా॥ సుబోధ్‌మిత్రా


డా॥ పి. జస్వంతరావు

**విశాఖపట్నం, 7-10-2012 :**

తరిమెల నాగిరెడ్డి మెమోరియల్ ట్రస్టు ఆధ్వర్యంలో **"తాకట్టులో భారతదేశం" గ్రంథంలో భారత సమాజ విశ్లేషణ ప్రాసంగికత**-అన్న అంశంపై విశాఖపట్నం పౌర గ్రంథాలయంలో సెమినార్ జరిగింది. ఉదయం 11 గంటలకు ప్రారంభమైన సెమినార్‌కు ట్రస్టు సభ్యుడు **డా॥ వై. సుధీర్‌రెడ్డి** అధ్యక్షత వహించారు. ఆయన మాట్లాడుతూ కా॥ టి.ఎన్. తన గ్రంథంలో- భారత సమాజం అర్ధవలస - అర్ధఫ్యూడలు సమాజంగావుందనీ, భూస్వామ్య విధానాన్ని అంతం చేయాల్సిన ప్రజాస్వామిక విప్లవం మిగిలిపోయివుందనీ, బ్రిటీషు వలస పాలన తొలగినా సామ్రాజ్యవాద దోపిడీ ఆధిపత్యాలు సాగుతున్నాయనీ, భారత బడా బూర్జువావర్గం దళారీ నిరంకుశ స్వభావం కలిగివుందని విశ్లేషించారన్నారు. కాగా ఈనాడు దేశాన్ని తాకట్టు పెట్టడంకాదు, అమ్మివేస్తున్నారని పరిశీలకులు వ్యాఖ్యానించే స్థితి ఏర్పడిందన్నారు. కా॥ టి.ఎన్. విశ్లేషణ, ఆయన రూపొందించిన విప్లవ పంథా ప్రాధాన్యతను మరోసారిగుర్తు చేసేందుకు ఈ సెమినార్ నిర్వహిస్తున్నామన్నారు.

ట్రస్టు కార్యదర్శి **డా॥ పి. జస్వంతరావు** తన ప్రారంభోపన్యాసంలో భారత సమాజాన్ని పురోగమనంలో నడిపించేందుకు విదేశీ పెట్టుబడుల ప్రవేశానికి ద్వారాలు బార్లా తెరిచే నూతన ఆర్థిక విధానాలను చేపట్టామని భారత పాలకులు చెప్పుకున్నారనీ, వీటివల్ల పరిశ్రమలు పెరుగుతాయనీ, ఉపాధి సౌకర్యాలు పెరుగుతాయనీ చెప్పుకున్నారు. కానీ రెండు దశాబ్దాల తర్వాత విదేశీ పెట్టుబడులపై వున్న ఆంక్షలను పూర్తిగా తొలగించకపోతే, 1991 నాటి సంక్షోభమే తిరిగి ఏర్పడుతుందనీ, రెండవ దశ సంస్కరణలను చేపట్టాననీ ప్రధాని మన్మోహన్‌సింగ్ చెప్పుకున్నారనీ, నూతన ఆర్థిక సంస్కరణలు ప్రకటిత లక్ష్యాలను సాధించలేదనీ, మళ్లీ సామ్రాజ్యవాద పెట్టుబడే శరణ్యమైందని నిరూపితమైందన్నారు. ఆనాడు కా॥ టి.ఎన్. చెప్పినట్లు విదేశీ పెట్టుబడి ద్రవ్య వనరులను కైవశం చేసుకుని తనపై పరాధీనతను పెంచుకుంటుందని మరోసారి స్పష్టమైందన్నారు.

'భారత్ బడా బూర్జువా వర్గం విదేశాలలో పెట్టుబడులు పెడుతున్నదనీ, ప్రపంచ పెట్టుబడి దారులతో పోటీపడుతున్నదనీ బహుళజాతి కంపెనీలుగా అవి రూపొందుతున్నాయని చెప్పుకుంటున్నారు. కానీ భారత బడా బూర్జువా వర్గం దేశంలోని తన పరిశ్రమలను సామ్రాజ్యవాదుల కప్పగిస్తున్నాయి. సిమెంటు, ఔషధాలు, పేపరు మిల్లులూ, భారీపరిశ్రమలూ సామ్రాజ్యవాదకంపెనీల చేతుల్లోకి పోతున్నాయి. ఒక్క రక్షణ రంగంలో ఒకటి రెండు తప్ప, అన్ని పరిశ్రమల్లోకీ విదేశీ పెట్టుబడులు వచ్చి వాటిని ఆక్రమించుకుంటున్నాయి. భారత పెట్టుబడిదారుల కంపెనీలు విదేశాలలో పెడ్తున్న పెట్టుబడులను పరిశీలిస్తే దానిలో 80 శాతంపైగా ఐటి కంపెనీలే వున్నాయి. రెండవస్థానంలో మందుల కంపెనీలున్నాయి. సామ్రాజ్యవాదుల పొరుగు సేవలపై ఆధారపడిన ఐటి రంగం ఉత్పాదక పరిశ్రమకాదు; విదేశీ కంపెనీలకు చౌకగా సేవలందించేది. కాగా భారతదేశంలో ఉత్పత్తి చేసిన మందులను, అవి పేటెంటుహక్కు తీరిపోయిన జనరిక్ మందులను విదేశాలలో అమ్ముకునేందుకు విదేశాలలో కంపెనీలు పెడుతున్నారు. తమపై ఆధార పడిన ఐటి కంపెనీల ప్రారంభాన్ని ఆహ్వానించిన సామ్రాజ్యవాదులు, భారత మందుల కంపెనీలను కొనివేస్తున్నారని సోదాహరణంగా వివరించారు. ఫలితంగా భారత బడాబూర్జువా వర్గం దళారీ స్వభావాన్నే కలిగి వుందనీ, ఇటీవల దూసుకొచ్చిన బడా బూర్జువాలందరూ ప్రభుత్వ బడ్జెట్టును కొల్లగొట్టడం ద్వారానే పెరిగారనీ వివరించారు. ఆ విధంగా భారత బడాబూర్జువా వర్గం, దళారీ నిరంకుశాధికార స్వభావాన్నే నేటికీ కలిగివుందని చెప్పారు.

సామ్రాజ్యవాదులకు గేట్లు బార్లా తెరవటంతో దేశ ఖనిజవనరులన్నీ వారి పాదాక్రాంతమవుతున్న తీరును ఆయన వివరించారు. చమురు రంగంలో విదేశీ పెట్టుబడులను అనుమతించటంతో గోదావరి జిల్లాలోని రవ్యక్షేత్రాన్ని పొందిన కెనడా కంపెనీ కెయిర్న్ ఇండియా బ్యారలు పదిన్నర డాలర్లకు వెలికి తీసిన చమురును భారత ప్రభుత్వ సంస్థ 'ఆయిలు యిండియా'కు 65 డాలర్లుకు అమ్ముకుంటున్నదనీ, దీనిని భారత ప్రజలకు ప్రభుత్వం తిరిగి బ్యారలు వంద డాలర్లు లెక్కన అమ్ముతున్నదనీ వివరించారు. అలాగే రిలయన్సు పొందిన కేజి బేసిన్ డి-6 గ్యాసుకు దిగుమతి చేసుకుంటే అయ్యే ఖరీదును పొందటానికి, గ్యాసు ఉత్పత్తి తగ్గించి ప్రభుత్వాన్ని బ్లాక్ మెయిలు చేస్తున్నదనీ, ప్రభుత్వం దానికి లొంగి 13 డాలర్లు గ్యాసుకు చెల్లించడానికి పూనుకుంటున్నదనీ అన్నారు. అదే జరిగితే గ్యాసు ద్వారా ఉత్పత్తి అయ్యే విద్యుత్తు ఖరీదు యూనిటుకు 13 రూ॥లవుతుందనీ, ఇన్నాళ్లూ గ్యాసు ద్వారా విద్యుదుత్పత్తి చౌక అని ప్రజలను మభ్యపెట్టారన్నారు. వాస్తవానికి కేజిబేసిన్‌లోని డి-6 బ్లాకును, రిలయన్సు బ్రిటిషు గ్యాసు అన్నకంపెనీపరం చేసిందన్నారు. అదేవిధంగా ఇనుము, బాక్సైటు, రాగి గనులనూ, సముద్రతీర ఇసకలో లభ్యమయ్యే అరుదైన ఖనిజాలనూ విదేశీ కంపెనీల పరం చేశారన్నారు.

ఇక ద్రవ్య రంగంలో, ఏ పని చేపట్టాలన్నా నిధులకొరత సాకు చెప్పే పాలకులు, మధ్య తరగతి ప్రజలు ఆదాచేసి పొదుపు చేసుకున్న సొమ్మునుకూడా బ్యాంకులు, బీమా రంగ ప్రైవేటీకరణ ద్వారా విదేశీకంపెనీల కప్పజెప్పారన్నారు. అలాగే ఉద్యోగులు వేతనాల నుండి సేకరించిన నిధులను షేరు మార్కెట్టులో జూదమాడేందుకు విదేశీ కంపెనీలకు అప్పగించారన్నారు. ఈ విధంగా ప్రజల పొదుపు సొమ్మును విదేశాలకప్పగించి, ప్రజలపై పన్నులు విధించటం పెంచిందన్నారు.

ప్రభుత్వ విధానాలవల్ల చిన్న, మధ్యతరహా పరిశ్రమలు మూతబడి సంక్షోభం ఏర్పడింది. చిన్న పరిశ్రమలకు రక్షణ కల్పిస్తున్నామంటూ, వాటికి కేటాయించిన పరిశ్రమలను మెల్లమెల్లగా రిజర్వేషను లిస్టు నుండి తొలగించారన్నారు. ఇది భారతదేశ శ్రామికుల ఉపాధి సౌకర్యాలను కుదించి వేస్తున్నదన్నారు.

కాలం చెల్లిపోయిన భూస్వామ్య వ్యవస్థను రద్దు చేసే చర్యలు తీసుకోకుండా దానిని నిలబెట్టి ఉంచుతున్నది. వ్యవసాయాభివృద్ధి పేరిట అది తీసుకున్న చర్యలన్నీ భూస్వాముల పునాదిని బలీయం చేశాయి. ఫలితంగా కోట్లాదిగావున్న పేద రైతాంగం అతి తక్కువ భూమిపై ఆధార పడుతున్నారు. సెజ్‌ల పేరిట వారి భూములు లాగివేసుకుంటున్నారు. మరోవైపున కొద్దిమంది చేతిలో భూమి కేంద్రీకరణ పెరుగుతున్నది. దీనిపై సామ్రాజ్యవాద మార్కెట్టు దోపిడీ సాగిస్తున్నది.

భూస్వామ్య విధానాన్ని రద్దుచేయకుండా, దేశంపై సామ్రాజ్య వాద ఆధిపత్యాన్ని తొలగించకుండా, దీనికోసం దున్నేవానికే భూమి కేంద్రంగా భూ సంస్కరణలు అమలు జరపకుండా, సామ్రాజ్యవాదుల పెట్టుబడులను స్వాధీనం చేసుకోకుండా భారత సమాజ పురోగమింపజాలదని కా॥ టి.ఎన్. చెప్పారు. బడా బూర్జువా వర్గానికీ, భూస్వామ్య వర్గానికి ప్రతినిధిగా సామ్రాజ్యవాదానికి సేవచేస్తున్న భారత ప్రభుత్వం ఈ కర్తవ్యాలను నెరవేర్చలేదని కూడా ఆయన చెప్పారు. ఆయన చూపిన ప్రజాపంథాలో నూతన ప్రజాస్వామిక విప్లవాన్ని పరిపూర్తి చేయాల్సిన కర్తవ్యం మన ముందుంది అంటూ డా॥ జస్వంతరావు తన ఉపన్యాసాన్ని ముగించారు.

ముఖ్య ఆహ్వానితుడిగా వచ్చిన సంబల్‌పూర్ విశ్వవిద్యాలయం ఆర్థిక శాస్త్ర విశ్రాంత ఆచార్యులు **ప్రొ॥ గోలక్‌బీహరీనాథ్** తన ప్రసంగంలో-భారత సమాజం అర్థభూస్వామ్య, అర్థవలస వ్యవస్థగానే వుందన్నారు. (ఆయన ప్రసంగం పూర్తి పాఠాన్ని వచ్చే సంచికలో అందిస్తాము). ప్రొ॥ గోలక్‌బీహరీనాథ్ తన ప్రసంగంలో వ్యవసాయరంగంలో పెట్టుబడిదారీ విధానంపై 1960 దశాబ్దంలో జరిగిన చర్చను ప్రస్తావించారు. ఆ చర్చ అకడెమిక్‌గా సాగిందనీ, అదే కాలంలో కమ్యూనిస్టులు, భూస్వామ్య విధానంపై పోరాటాలు సాగించిన చరిత్రను గుర్తుచేశారు. వ్యవసాయ రంగంలో పెట్టుబడిదారీ సంబంధాలు వచ్చాయా లేదా అన్నది చర్చనీయాంశం కాదనీ, అలా వస్తున్న పెట్టుబడి స్వభావమేమిటో పరిశీలించాలనీ అన్నారు. భూస్వామ్య దేశంగా వున్న భారత్‌లోకి బ్రిటీషుపాలనతో సామ్రాజ్యవాద పెట్టుబడి ప్రవేశించి, భూస్వామ్య వ్యవస్థను అర్ధభూస్వామ్యగానూ, ఆ తర్వాత వలసను అర్ధవలస వ్యవస్థగానూ మలిచిన చారిత్రక పరిణామాన్ని వివరించారు. స్వాతంత్రం పొందిన తర్వాత కూడా పాలకులు వ్యవస్థలో మార్పులు చేయకుండా. ప్రజలను మభ్యపరిచే భూ సంస్కరణ చట్టాలు చేసి అమలు జరపలేదనీ, సామ్రాజ్యవాదుల కనుసన్నల్లోనే నడుస్తున్నారనీ అన్నారు.

అందువల్లనే సామ్రాజ్యవాదుల నయా ఉదారవాద విధానాలను ఆమోదించి అమలు చేస్తున్నారనీ, పారిశ్రామిక, వ్యవసాయ రంగాలను సామ్రాజ్యవాదుల దోపిడీకి అనువుగా ప్రపంచ బ్యాంకు నిర్దేశిత విధానాలు అమలు జరుపుతున్నారన్నారు. ఈ రీత్యా కా॥ టి.ఎన్. వ్రాసిన 'తాకట్టులోభారతదేశం' గ్రంథానికి ప్రచురణ కాలం నాటి కంటే నేడు ఇంకా ఎక్కువ ప్రాధాన్యత వున్నదని అన్నారు.

భారత పాలకులనుసరిస్తున్న నయాఉదారవాద విధానాల ఫలితంగా భూమి పరాయీకరణ రెండు విధాలుగా పెరిగిందనీ, దివాళాతీసిన రైతాంగం భూమికి దూరం కావటం ఒకటికాగా, అభివృద్ధి ప్రాజెక్టుల పేరిట రైతాంగాన్ని భూమినుండి వెళ్ళగొట్టడం రెండవదన్నారు. అలాగే పారిశ్రామిక రంగాన్ని విదేశీ పెట్టుబడి ముంచెత్తుతున్నదన్నారు.

కనుక ఈ పెట్టుబడి స్వభావాన్ని గుర్తించటం కీలకాంశమన్నారు. ఇది సామ్రాజ్యవాద పెట్టుబడి అనీ, దీనికనుసన్నల్లోనే భారత్‌లో పెట్టుబడిదారీ సంబంధాలు పెరుగుతున్నాయనీ, ఫలితంగా భారత బడాబూర్జువా వర్గపు దళారీ స్వభావం కొనసాగుతున్నదన్నారు.

కనుక భూమి సమస్యను రాజకీయంగా పరిష్కరించకుండా భారత సామాజిక వ్యవస్థ మార్పు చెందదనీ, మార్క్సిజం-లెనినిజాన్ని విశ్వశించేవారు మార్పుకొరకు సాగే పోరులో అగ్రభాగాన నిలవాలనీ కోరారు.

తరువాత అఖిలభారత ఖేత్ మజ్దూర్ కిసాన్ సభ (ఏఐకెఎంకెఎస్) కన్వీనర్ **కా॥ సుబోధ్‌మిత్రా** మాట్లాడుతూ 'తాకట్టులో భారతదేశం' కోర్టులో కా॥ టి.ఎన్. ఇచ్చిన ప్రకటన; ఇదొక చారిత్రక పత్రం; దీని ప్రాధాన్యత భారత ఆర్థిక వ్యవస్థను ప్రజల ముందు చర్చకు పెట్టింది. అయితే అది అక్కడికే పరిమితం కాలేదు. ఇది భారత విప్లవానికి ఒక కార్యాచరణ ప్రణాళికను ప్రజల ముందుంచింది అన్నారు.

ఈ ప్రకటన దేశంలో సాయుధ విప్లవం అనివార్యమని చెప్పింది. **(తరువాయి 5వ పేజీలో)**

**వచ్చే సంచికలో ...**

**2012 అక్టోబరు 13-17 తేదీలలో**
**లక్షింపేటనుండి శ్రీకాకుళంవరకు**
**'లక్షింపేట దళిత పోరాట సంఘీభావకమిటి' ఆధ్వర్యంలో**
**నిర్వహించిన పాదయాత్ర; అక్టోబరు 17న శ్రీకాకుళంలో**
**నిర్వహించిన బహిరంగసభ రిపోర్టు**

*Printed, Published and Owned by P.Jaswantha Rao 32-13-26/1, B.M.Rao Road, Moghalrajapuram, Vijayawada-520 010*
*and Printed at Chaitanya Printers, Gora Veedhi, Suryaraopet Vijayawada-2*
*Editor: P. Jaswantha Rao, 32-13-26/1, B.M.Rao Road, Moghalrajapuram, Vijayawada-520 010*